

అతిథులకు స్వాగతం!

సైబీరియా అతిథులు వచ్చేశాయి. నేలపట్టు చెరువుల్లోని పచ్చని కడపచెట్లు తెల్లని కొంగల్ని పూసినట్లుగా కనిపిస్తున్నాయి. ఆకాశంలో ఎగురుతూ, నీళ్లలో ఈదులాడుతూ, ఎండిన పుల్లల్ని ముక్కున కరచుకుని వస్తూ, గూళ్లను అల్లుకుంటూ, పచ్చని గడ్డితో మెత్తని పడకల్ని గూటిలో సిద్ధం చేసుకుంటూ, జత పక్షుల్ని వెతుక్కుంటూ ఎటు చూసినా సందడి కనిపిస్తోంది. బారులు తీరి ఎగిరి వస్తున్న అతిథులతో నేలపట్టు కళకళలాడుతోంది.

→ ఆరు కిలోల చేపల్ని మోయగలదు ఈ సంచి

- 8వ పేజీలో -



ఎక్సైజ్ నిబంధనల ప్రకారం మద్యం షాపులు, బార్లు నిర్వహిస్తాం.

- లైసెన్సులు పొందేటప్పుడు నిర్వాహకులు చెప్పే మాట ఇది. దుకాణం తెరిచాక పలువురు నిబంధనలకు నీళ్లొదులుతున్నారు. వేళలతో నిమిత్తం లేకుండా మద్యం విక్రయిస్తున్నారు. అలాంటి వారిపై నిఘాకు.. చర్యలకు ఎక్సైజ్ శాఖ సిద్ధమవుతోంది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

టైం మించితే 'కిక్కు' దిగుతుంది

జిల్లాలో 32 బార్లకు 28.. 250 మద్యం దుకాణాలకు గాను 248 ప్రారంభమయ్యాయి. ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం మద్యం దుకాణాలు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు.. బార్లు ఉదయం 10 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు తెరచి ఉంచాలి. కానీ, కొందరు నిర్వాహకులు ఆదాయార్జన కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. కొందరైతే ఉదయం 8 గంటలకే బార్లను గుట్టుచప్పుడు కాకుండా బార్లా తెరుస్తున్నారు. ఇక, పలు మద్యం దుకాణాలకు షట్టర్లు వేసినా.. సమీప కూల్ డ్రింక్, బడ్డీ కొట్టుల్లో మద్యం ఉంచి.. ఎనీటైం విక్రయాలు జరుపుతున్నారు. మరికొందరైతే మద్యం షాపుల విషయంలో వేళలు పాటించడం లేదు. వీటిపై ఫిర్యాదులతో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ విషయంలో ఎలాంటి విమర్శలు, ఆరోపణలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. ఇప్పటికే ఉదయం 10 గంటల్లోపు ఎక్సైజ్ సిబ్బంది మద్యం దుకాణాలు, బార్లు తెరవలేదని.. రాత్రి 10 గంటలకు మద్యం షాపులు.. 12 గంటలకు బార్లు మూతపడ్డాయని సూచించేలా సెల్ఫీ ఫొటోలు తీసి జిల్లా అధికారులకు అప్‌లోడ్ చేస్తున్నారు. అయినా, ఫిర్యాదులు వస్తుండటంతో మద్యం షాపులు, బార్లపై మూడెంచల నిఘా ఏర్పాటు చేసింది. ప్రతి చోటా ఎక్సైజ్ సీఐ ఆధ్వర్యంలో ఒకటి.. ఎక్సైజ్ ఈఎస్, ఏఈఎస్ స్థాయిలో రెండోది.. డిప్యూటీ కమిషనరు ఆధ్వర్యంలో మూడోది చొప్పున కమిటీలు ఉంటాయి. ఈ కమిటీల్లో సభ్యులైన ఎన్‌ఫోర్సుమెంటు.. ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు సంయుక్తంగా జిల్లాలో తనిఖీలు చేస్తారు. తిరుపతి జిల్లాలోని కమిటీలు చిత్తూరు జిల్లాలో.. అక్కడి అధికారులను తిరుపతి జిల్లాకు తనిఖీలు చేయిస్తారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కేసు నమోదు చేయడంతో పాటు లైసెన్సు రద్దు చేయాలని కమిషనరుకు సిఫార్సు చేస్తామని ఈఎస్ నాగమల్లేశ్వర రెడ్డి స్పష్టం చేశారు.

నత్తనడకన తుడా ఎల్‌ఆర్‌ఎస్

- సమన్వయలోపంతో కదలని ఫైళ్లు
- 2674 దరఖాస్తుల్లో 36కే అప్రూవల్

తిరుపతి- ఆంధ్రజ్యోతి

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) పరిధిలో అనధికార లేఅవుట్లు, స్థలాల క్రమబద్ధీకరణకు తీసుకొచ్చిన లేఅవుట్ రెగ్యులరైజ్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్) నత్తనడకన సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం గత నెల 23కే ముగియాల్సిన గడువు వచ్చే ఏడాది జనవరి 23వరకు (మూడు నెలలు) పొడిగిస్తూ అవకాశం కల్పించినా.. క్షేత్రస్థాయిలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో పురోగతి కనిపించడం లేదు. ఎక్కువ దరఖాస్తులు ప్రాథమిక స్థాయి పరిశీలనలోనే నిలిచిపోతున్నాయి. ఆన్‌లైన్ అప్లికేషన్లు నెలల తరబడి పెండింగ్‌లో ఉండడం, పలుచోట్ల అప్పటికే నగదు చెల్లించినా, బాధితులకు సమాచారం లేకపోవడం వంటి అంశాలు బయటపడుతున్నట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయి సిబ్బంది లోపం, అధికారులతో సమన్వయం లేకపోవడం, శాఖల మధ్య సమాచారం చేరకపోవడం వంటివి ప్రధాన కారణాలుగా తెలుస్తున్నాయి. 2020 లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకంలో 4254 దరఖాస్తులు అందగా.. అందులో 2466 ఆమోదించి ఎల్‌ఆర్‌ఎస్ ఇచ్చారు. సవరణలతో కొనసాగింపుగా వచ్చిన ఎల్‌ఆర్‌ఎస్-2025 ద్వారా వచ్చినవాటితో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్నవి కలిపి ఇప్పటికే 2674 అప్లికేషన్లు అందాయి. వీటిలో ఇప్పటివరకు కేవలం 36 మాత్రమే అప్రూవల్ అయ్యాయి. ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా సుమారు రూ.25 కోట్ల ఆదాయాన్ని తుడా లక్ష్యంగా పెట్టుకుంది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల లెక్క చూస్తే ఆ దిశగా పనిచేయనట్లు అర్థమవుతోంది.



ఎల్‌ఆర్‌ఎస్ తీసుకుంటే...

ఎల్‌ఆర్‌ఎస్ చేసుకోవడం వల్ల స్థలానికి చట్టబద్ధత వస్తుంది. ఇంటి నిర్మాణానికి అనుమతులు సులభంగా వస్తాయి. మౌలిక వసతుల కల్పన బాధ్యత స్థానిక సంస్థ తీసుకుంటుంది. బ్యాంకు రుణాలతో పాటు క్రయ, విక్రయాలకు అడ్డంకులు ఉండవు. స్థల యజమానులు కూడా దీనిపై అవగాహన లేక అవకాశాన్ని చేజార్చుకుంటున్నారనే చెప్పాలి.

ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు : 2674, అప్రూవల్ అయినవి : 36

ఫీజు ఇంటిమేషన్ : 19, షార్ట్ ఫాల్ : 5, పెండింగ్ దరఖాస్తులు : 2614

915 అనధికార లేఅవుట్లు

2025జూన్ 30నాటికి రిజిస్టర్ అయిన అనధికారిక, ఆమోదం లభించని ప్లాట్లను క్రమబద్ధీకరించే లక్ష్యంతో ఎల్‌ఆర్‌ఎస్ అమలు చేస్తున్నారు. జిల్లాలో ఏర్పాటైన లేఅవుట్లకు 60 శాతం వరకు అనుమతులు లేవు. 2025 అక్టోబరు నాటికి తుడా పరిధిలో 915 అనధికార లేఅవుట్లు గుర్తింపయ్యాయి.వీటిలో 630గ్రామీణ ప్రాంతాలు, 285 పట్టణ ప్రాంతాల్లో ఉన్నాయి. సుమారు 20వేలకు పైగా ప్లాట్లు ఎల్‌ఆర్‌ఎస్ తీసుకునేందుకు అవకాశం ఉంది.

ఎల్లుండి డిప్యూటీ సీఎం రాక



తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రెండు రోజుల ఉమ్మడి జిల్లా పర్యటనకు శుక్రవారం తిరుపతికి రానున్నారు. ఉదయం 10గంటలకు రేణిగుంట మండలం మామండూరు అటవీక్షేత్రాన్ని.. మంగళం వద్దనున్న ఎర్రచందనం గోదామును పరిశీలించి హోటల్ తాజ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 3గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుని ఎర్రచందనం పరిరక్షణ, స్మగ్లింగ్‌ను అరికట్టడం వంటి అంశాలపై పోలీసు, అటవీ, రెడ్ శాండిల్ టాస్క్‌ఫోర్సు అధికారులతో సమీక్షిస్తారు. శనివారం ఉదయం చిత్తూరు జిల్లా పలమనేరుకు చేరుకుని కుంకీ ఏనుగుల సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. ఏనుగుల వల్ల నష్టపోయిన రైతులు, అటవీ శాఖ అధికారులతో సమావేశమవుతారు. అదే రోజు తిరుపతికి చేరుకుని విజయవాడకు తిరుగు ప్రయాణమవుతారని కలెక్టర్ వెంకటేశ్వర్, సీసీఎఫ్ సెల్వం తెలిపారు.

ఢిల్లీ సైన్స్‌టూరుకు ఇద్దరు విద్యార్థినులు



దత్తసాయి చరిష్మ - వర్ణిక శృతిశర్మ

తిరుపతి(విద్య), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈనెల 6 నుంచి 8 వరకు ఇస్రో నిర్వహించనున్న వైజ్ఞానిక పర్యటనకు జిల్లా నుంచి ఇద్దరు టెన్త్ విద్యార్థినులు ఎంపికయ్యారు. సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన, షార్ సెంటర్ పోటీలు, ఇతర రంగాల్లో కనబరిచిన ప్రతిభ ఆధారంగా తిరుపతి ఎస్జీఎస్ పాఠశాలకు చెందిన మేడ దత్తసాయి చరిష్మ, నాయుడుపేట జడ్పీ బాలికల స్కూలుకు చెందిన వర్ణిక శృతిశర్మను ఎంపికచేశారు. అక్కడ నాసా ఇంజనీర్ల ముఖాముఖిలో పాల్గొంటారు. సైన్స్ కార్యకలాపాలు, సదస్సుల్లో భాగస్వాములు కానున్నారు. రష్యన్ సెంటర్ ఆఫ్ సైన్స్‌కల్చర్, నేషనల్ సైన్స్ మ్యూజియం, నెహ్రూ ప్లానిటోరియంలను సందర్శించనున్నారు. వీరిద్దరూ బుధవారం విజయవాడ నుంచి విమానంలో బయలుదేరనున్నారు.

నాన్న వస్తే.. టెర్రస్‌పైకి పంపండి

- హాస్టల్‌పైకి వెళ్లి ఇంజనీరింగ్ విద్యార్థి బలవన్మరణం



సాయి చందు మృతదేహం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): 'మా నాన్నకు ఫోను చేశా. వస్తాడు. వచ్చిన వెంటనే టెర్రస్‌పైకి పంపండి. నేను కొంచెం మాట్లాడాలి' అంటూ సహ విద్యార్థులకు చెప్పాడు. హాస్టల్‌పైకి వెళ్లి బలవన్మరణానికి పాల్పడ్డాడు. బిడ్డతో మాట్లాడదామని వచ్చిన తండ్రికి శవమై ఎదురుగా కనిపించడంతో గుండెలు బాదుకుని విలపించారు. ఈ విషాద ఘటన తిరుపతి- రేణిగుంట రోడ్డులోని ఓ ఇంజనీరింగ్ విద్యాసంస్థలో చోటు చేసుకుంది. తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ తెలిపిన ప్రకారం.. నెల్లూరు నగరం స్టోన్‌హౌస్‌పేటకు చెందిన శ్రీనివాసులు కుమారుడు సాయి చందు(20) తిరుపతి - రేణిగుంట మార్గంలోని కళాశాలలో బీటెక్‌లో చివరి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం రాత్రి తన తండ్రి శ్రీనివాసులుకు ఫోన్ చేసి, 'నిన్ను చూడాలని ఉంది. ఒకసారి రా. అలాగే ఫీజు కట్టాలి' అని చెప్పాడు. ఉదయం వస్తానని తండ్రి చెప్పారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు హాస్టల్‌లో తోటి స్నేహితుల వద్దకు వెళ్లి మరి కొద్దిసేపటిలో తన తండ్రి వస్తారని, టెర్రస్‌పైన తన వద్దకు పంపాలని సాయిచందు చెప్పి వెళ్లాడు. గంట తర్వాత శ్రీనివాసులు హాస్టల్‌కు రాగా.. మిద్దెపైన సాయిచందు ఉన్నాడని ఓ విద్యార్థి తీసుకెళ్లాడు. అక్కడ కిటికీ ఊచకు ఉరేసుకుని, నిర్జీవంగా సాయిచందు కనిపించాడు. అందరూ కేకలు వేసి సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తిరుచానూరు పోలీసులు కేసు నమోదుచేసి, మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. ఓ అమ్మాయి ప్రేమ విషయంలో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ తెలిపారు. ఇంటికి అండగా ఉంటాడనుకున్న సమయంలో ఇలా కొడుకు అర్ధంతరంగా తనువు చాలించడంతో శ్రీనివాసులు గుండెలు అవిసేలా విలపించడం అక్కడి వారికి కన్నీరు పెట్టించింది.

- 'కాశీబుగ్గ' ఎఫెక్ట్

ఆలయాల వద్ద భారీ బందోబస్తు



ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు4(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ తొక్కిసలాట నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం జిల్లాలోని శివాలయాలు, జలపాతాల వద్ద భారీ బందోబస్తును ఎస్పీ సుబ్బరాయుడు ఏర్పాటు చేశారు. శ్రీకాళహస్తి, కపిలతీర్థం, చంద్రగిరి ముక్కోటి, తలకోన, గుడిమల్లం, నారాయణవనం, కైలాసకోన, సదాశివ కోన, సురుటుపల్లి తదితర ప్రాంతాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. ఆ మేరకు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్పీ చెప్పారు. అవసరమైన ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన శివాలయాల వద్ద సీఐ స్థాయి అధికారితో పాటు ఇద్దరు ఎస్ఐలు, ముగ్గురు ఏఎస్ఐలు, 10 మంది సిబ్బందిని నియమించారు. చిన్న, చిన్న శివాలయాలైతే ఎస్ఐ స్థాయి అధికారి, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, ఐదారు మంది సిబ్బంది బందోబస్తు విధుల్లో ఉంటారు. ప్రతి ఆలయం వద్ద ఎస్టీఎఫ్ పార్టీలు నిఘాలో ఉంటాయి. ఎక్కడైనా ఘటన జరిగేందుకు ఆస్కారం ఉందనుకుంటే స్పెషల్ పార్టీలు అక్కడకు చేరుకునేలా ఏర్పాటు చేశారు. 'నిర్దేశిత క్యూలలో వెళ్లాలి. భద్రతా సిబ్బంది సూచనలు పాటించాలి. రద్దీ ఎక్కువగా ఉంటే దర్శనానికి ఓపికతో వేచి ఉండాలి. వృద్ధులు, మహిళలు, పిల్లలు ముందుగా వెళ్లేలా సహకరించాలి' అంటూ భక్తులకు ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు.

చిరుతల కట్టడికి ప్రణాళిక

- త్వరలో వైల్డ్‌లైఫ్ అథారిటీ బృందం తిరుపతికి రాక
- అటవీశాఖ అధికారి సాయిబాబా వెల్లడి



అటవీశాఖాధికారి సాయిబాబా

మంగళం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): 'ఆహారం కోసం శునకాలు, ఇతర ప్రాణుల కోసం చిరుతలు అడవి నుంచి బయటకు వస్తున్నాయి. ఇలా తిరుపతిలోని విశ్వవిద్యాలయాల ఆవరణ.. జీవకోన, మంగళం ప్రాంతాల్లో తిరుగుతున్నాయి. వీటి కట్టడికి శాశ్వత ప్రణాళిక కోసం వైల్డ్‌లైఫ్ అథారిటీతో సంప్రదిస్తున్నాం. త్వరలోనే ఒక బృందం ఈ ప్రాంతాల్లో పర్యటిస్తుంది' అని జిల్లా అటవీశాఖ అధికారి సాయిబాబా చెప్పారు. తిరుపతిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్లు లేని రోజుల్లోనూ చిరుతల కదలికలు ఉండేవని, ఇప్పుడు సోషల్ మీడియా ఉండటంతో ఎక్కువగా వైరల్ అవుతున్నట్లు చెప్పారు. చిరుతలు యూనివర్సిటీ పరిధిలోకి రాకుండా సోలార్ కంచె ఏర్పాటు ప్రతిపాదనను వైల్డ్‌లైఫ్ అథారిటీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. తిరుమల నడక మార్గంలో ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటుపైనా చర్చిస్తామన్నారు. ఎస్వీయూ, వెటర్నరీ వర్సిటీ ప్రాంతాల్లో, అలిపిరి నుంచి జూపార్కు రోడ్డులో ఆహార వ్యర్థాలు పడేయకుండా చూడాలన్నారు. ట్రాప్‌కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో సాయంత్రం 6 నుంచి ఉదయం 6గంటల వరకు ఒంటరిగా తిరగరాదన్నారు. చిరుతలపై అవగాహన కల్పించేలా బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. వీటిపై వైల్డ్ లైఫ్ అథారిటీతో చర్చించాక తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. జిల్లాలో 40వరకు ఏనుగులు మూడు గ్రూపులుగా భాకరాపేట, మామండూరు, పనపాకం ప్రాంతాల్లో సంచరిస్తున్నాయని తెలిపారు. పాపవినాశం, నడకమార్గంలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసుకున్న షాపులపై పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

నా ఇష్టం.. రోడ్డుపైనే ఆపుతా



'ఫుల్లు'గా మందేశాడు. ఆపై వ్యాను నడిపాడు. ఇదే తప్పనుకుంటే, ఆ వ్యానును నడిరోడ్డుమీద నిలిపాడు. వీరంగం చేశాడు. ఇలా శుక్రవారం ఏర్పేడు మండలం జంగాలపల్లి ఐసర్ సమీపాన.. వెంకటగిరి రోడ్డులో అతిగా మద్యం తాగిన డ్రైవరు చర్యతో వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. వీరు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆ వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

- ఏర్పేడు, ఆంధ్రజ్యోతి



ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డితో టీడీపీ నేతలు

మరోసారి మంగళగిరికి

సత్యవేడు టీడీపీ పంచాయితీ

సత్యవేడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల పందేరంలో అన్యాయం జరిగిందంటూ.. సత్యవేడు నియోజకవర్గ టీడీపీ పంచాయితీ మళ్లీ మంగళగిరి చేరింది. నేతలు రామాంజులు నాయుడు, ఇళంగోవన్‌రెడ్డి, గోపీనాథరెడ్డి, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, పరమశివం తదితరులు మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయానికి వెళ్లారు. మంత్రి లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు, రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డితో భేటీ అయ్యారు. పార్టీ పరిస్థితులు, పరిణామాలు, నామినేటెడ్ పదవుల భర్తీలో తమకు అన్యాయం జరిగిందని వారు చెప్పినట్లు సమాచారం. సీనియర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు అమలవుతున్నాయని ఆరోపించారని తెలిసింది. గ్రామ, మండల పార్టీ పదవుల ఎంపికలో క్షేత్రస్థాయి నివేదికలు తీసుకోకుండా అనర్హులకు కట్టబెడుతున్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు. గత ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థికి పని చేసిన (చెరకు వర్గం) వారితో పాటు వైసీపీ నుంచి వచ్చిన మరో వర్గం పెత్తనం ఎక్కువై పార్టీకి పని చేస్తున్న నాయకులకు ప్రాధాన్యం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. దీనిపై అధిష్ఠానం ఎలా స్పందిస్తుందో చూడాలి.

గోకులాల నిర్మాణాలు పూర్తిచేయాలి



మినీ గోకులం భూమిపూజలో ఎమ్మెల్యే నాని

పాకాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకంలో మంజూరు చేసిన 267 మిని గోకులాల నిర్మాణాలను ఈ నెలాఖరులోపు పూర్తిచేయాలని ఎమ్మెల్యే నాని కోరారు. దామలచెరువు పంచాయతీ జింకలమిట్టలో మంగళవారం ఆయన జిల్లా ఉపాధిహామి ప్రాజెక్టర్ డైరెక్టర్ శ్రీనివాసప్రసాద్‌తో కలిసి గోకులం నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆనందగిరి సుబ్రమణ్యస్వామి ఆలయ ఆవరణలో గోకులాల లబ్దిదారులతో సమావేశం నిర్వహించారు. 267 గోకులాల నిర్మాణానికి రూ.5,94 కోట్లు మంజూరుచేశామన్నారు. తహశీల్దార్ సంతోష్ సాయి, ఎంపీడీవో వాసుదేవరావు,, పాల్గొన్నారు. శంఖంపల్లె సమీపంలోని వీరాంజనేయస్వామిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. అనంతరం పలు ప్రారంభోత్సవాలు, భూమిపూజల్లో పాల్గొన్నారు.

లెటర్‌హెడ్ దుర్వినియోగం

● పోలీసులకు బోధనేతర ఉద్యోగ సంఘ నేతల ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న అసోసియేషన్ నేతలు

తిరుపతిరూరల్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ నాన్‌టీచింగ్ ఎంప్లాయిస్ సెంట్రల్ అసోసియేషన్ లెటర్‌హెడ్‌ని దుర్వినియోగం చేస్తున్న వారిని గుర్తించి చర్యలు చేపట్టాలని సంఘ అధ్యక్ష, ప్రధానకార్యదర్శిలు సి.నాగరాజు, కె.బాలకార్తీక్ పేర్కొన్నారు. సంఘ ఆధ్వర్యంలో మంగళవారం పలువురు నాయకులు ఎస్వీయూ పోలీసులకు ఫిర్యాదు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. లెటర్‌హెడ్ పేరిట నిరాధార, అసభ్యకర పదజాలంతో సామాజిక మాధ్యమం ద్వారా ప్రభుత్వానికి, అధికారులకు తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారన్నారు. సంఘసభ్యుల ప్రతిష్టకి భంగం వాటిల్లడంతోపాటు గందరగోళం ఏర్పడుతోందని పేర్కొన్నారు.

గ్రామాల్లో బీజేపీని బలోపేతం చేయండి

భాకరాపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్ రెడ్డి అన్నారు. ఎడంవారిపల్లె పడమాలమ్మ ఆలయ ఆవరణలో మంగళవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడిగా శివకుమార్‌నుఎన్నుకున్నారు. రావూరి హరినాగరాజ, చక్రపాణి, దేవేంద్రకు పార్టీలోకి ఆహ్వానించారు. కిశోర్‌కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

3 రోజులుగా నడిరోడ్డుపైనే కంటైనర్



చంద్రగిరి, నవంబరు 4(ఆంధ్ర జ్యోతి): జాతీయ రహదారిలోని చెక్ పోస్టు వద్ద ప్రమాదానికి గురైన ఓ కంటైనర్ మూడు రోజులుగా అక్కడే ఉంది. గత శుక్రవారం రాత్రి తిరుపతి నుంచి చిత్తూరు వైపు ఐరన్ స్తంభాల లోడు కంటైనర్ టైరుకు చంద్రగిరి ఫ్లైఓవర్‌పై పంక్చరైంది. అదుపు తప్పి జాతీయ రహదారిలో డివైడర్‌ను ఢీకొంది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీనిని మంగళవారం సాయంత్రం వరకు తొలగించలేదు. రాత్రి ఏదైనా వాహనం ఢీకొనే ప్రమాదముంది. ఈ హైవేలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

శేష, భూత వాహనాలపై దర్శనం



శేష వాహనంపై స్వామి అమ్మవార్లు

చంద్రగిరి, నవంబరు 4(ఆంధ్ర జ్యోతి): తొండవాడలో అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం స్వామి అమ్మవార్లకు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. 8 గంటలకు పార్వతీ పరమేశ్వర్ల ఉత్సవమూర్తులన శేష వాహనంపై ఊరేగించారు. 10.30 నుంచి 11.30 గంటల మధ్య స్వామివారికి అన్నాభిషేకం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి 7 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవర్లను సింహవాహనంపై ఊరేగించారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న శిల్పాబజార్



తిరుచానూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో గాంధీ శిల్పబజార్ హస్తకళల ప్రదర్శన ఆకట్టుకుంటోంది. వివిధ రాష్ట్రాల నుంచి 40 మంది హస్త, చేనేత కళాకారులు తమ ఉత్పత్తులను ఇందులో ప్రదర్శించారు. శ్రీకాళహస్తి కొయ్యబొమ్మలు, కలంకారీ, వెంకటగిరిచీరలు, మధురై సుమ్మడి శారీస్, ఎర్రకోట వస్తువులు, కళ్లంకార్డు బ్లాక్ ప్రింటెడ్ చీరలు, దుపట్టాలు, జ్యువెలరీ, బాంబూ క్రాఫ్టులు వంటి వస్తువులు ఆకర్షిస్తున్నాయి, ఈ నెల9 వరకు ప్రదర్శన ఉంటుందని కళా సృష్టి స్వచ్ఛంద సేవా సంస్థ దశరథాచారి తెలిపారు.

విద్యార్థులకు క్రీడాసామగ్రి పంపిణీ



క్రీడాసామగ్రి అందజేస్తున్న చిన్నబాబు

రామచంద్రాపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కుప్పంబాదూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు షాందాషాన ఫౌండేషన్ ఆర్థిక సాయంతో సొసైటీ ఫర్ సోషల్ సర్వీస్ సంస్థ క్రీడా సామగ్రిని వితరణచేసింది. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో చిత్తూరుపార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చిన్నబాబు మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం వల్ల ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యత లభిస్తుందన్నారు. ఎఈవో జయవేలు, సుజనకుమారి, సుబ్రహ్మణ్యం, యువరాజ్, పట్నం రామయ్య, శంకర్ పాల్గొన్నారు.

బేటీ బచావో-బేటీ పడావో ర్యాలీ

రామచంద్రాపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సి. రామాపురంలో మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో, బేటీ పడావో ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా లోకమాతాపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మనీల మాట్లాడుతూ పిల్లల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ, బాల్యవివాహాల నిర్మూలనలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలలు పాల్గొన్నారు.

మైనింగ్ అక్రమ తవ్వకాల పరిశీలన



గ్రావెల్ క్వారీని పరిశీలిస్తున్న అధికారులు

రామచంద్రాపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నెత్తకుప్పం రెవెన్యూ ఎల్వీపురం గ్రామ సమీపంలోని గ్యాప్ ఏరియా(గుట్ట పోరంబోకు)లో అక్రమ గ్రావెల్ క్వారీని భూగర్భ గనులశాఖ,రెవెన్యూ అధికారులు మంగళవారం పరిశీలించార్లు. గ్రావెల్ తవ్వకాల ప్రాంతం కొలతలు తీశారు. అక్రమంగా తవ్విన ప్రాంతం గ్యాప్ ఏరియాకు సంబంధించినట్టు మైన్స్ అధికారులకు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇక్కడ గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదని మైన్స్ అధికారులు స్పష్టం చేశారు. మట్టిని తరలిస్తున్నరెండు లారీలను సీజ్ చేశారు.

డ్రైనేజీ కాలువ పూడికతీత

తిరుపతిరూరల్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): గాంధీపురం గ్రామసచివాలయం మీదుగా జాతీయ రహదారి వెళ్లే మార్గంలోని డ్రైనేజీకాలువలో పంచాయతీకార్మికులు పూడికతీత పనులు చేపట్టారు. 'అధ్వాన పారిశుధ్యంతో నిత్యం యాతనే అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. మురుగు సాఫీగా ముందుకు కదిలే ఏర్పాట్లు చేశారు. కాలువ పక్కనే పడేసిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. బ్లీచింగ్ చల్లారు.

ఇరుకు గదుల్లో విద్యార్థులు ఇక్కట్లు

● పదేళ్లుగా అసంపూర్తిగానే బాలికల హాస్టల్ భవనం



చంద్రగిరిలో నిర్మాణ పనులను నిలిపేసిన బాలికల వసతి సంక్షేమ గృహం

చంద్రగిరి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఎస్సీ ప్రభుత్వ వసతి సంక్షేమ గృహంలో గదులు చాలక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కృష్ణ మందిరం ఎదురుగా బాలికల ఇంటి గ్రేటెడ్ హాస్టల్ ఆవరణలోనే గతంలో ఎస్సీ బాలికల పోస్టుమెట్రిక్ హాస్టల్ గదులను నిర్మించారు. ఇందులో ప్రస్తుతం సంక్షేమ అధికారి కార్యాలయంతో పాటు 12 గదులు ఉన్నాయి. 158 మంది విద్యార్థునులున్నారు. విద్యార్థునులకు గదులు చాలడంలేదని 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రెండవ అంతస్తు మంజూరు చేసింది. అప్పట్లో నిర్మాణం ప్రారంభించి 50 శాతం పనులు చేశారు. తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అసంపూర్తిగా నిర్మాణాల పూర్తికి నిధులు మంజూరు చేయలేదు. రెండవ అంతస్తు నిర్మాణం పూర్తయితే విద్యార్థునులకు అదనపు గదులతో సౌకర్యంగా ఉంటుంది. పక్కనే ఉన్న బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్లో భోజనశాలతో కలిపి 12 గదులు ఉన్నాయి. ఇందులో 150 మంది పాఠశాల విద్యార్థునులు, 210 మంది పోస్టుమెట్రిక్ విద్యార్థునులు ఉన్నారు. వీరు కూడా గదులు చాలక ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సీ వసతి సంక్షేమ గృహం నిర్మాణం పూర్తయితే కనీసం కొంత ఊరట లభిస్తుంది.

విజేతలకు బహుమతుల ప్రదానం



పాకాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం మండలస్థాయి సైన్స్ సంబరాలు నిర్వహించారు. చెకుముకి పోటీల విజేతలకు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ కుమార్ బహుమతులు అందజేశారు. అక్షయ్, మహమ్మద్ తౌఫీక్, రిషిధర్ రెడ్డి ప్రథమ స్థానం సాధించారు. హస్మిత, పవన్, కరీమున్నిషా రెండవస్థానంలో నిలిచారు. ఆంగ్ల మాధ్యంలో జునైద్ అహ్మద్, చాందిని, అభినవ్ మొదటిస్థానం, సంజన, జయశ్రీ, కార్తి విష్ణు ద్వితీయ స్థానం సాధించారు. ప్రథమ స్థానం సాధించిన టీములను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వి.వెంకటసిద్దులు, జయచంద్ర, అమర్‌నాథ రెడ్డి, మధు పాల్గొన్నారు.

ర్యాపిడో బైక్ సర్వీసులను రద్దు చేయండి



అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆటో కార్మికుల నిరసన

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 4(ఆంధ్ర జ్యోతి): తిరుపతిలో ర్యాపిడో బైక్ సర్వీసులను రద్దు చేసి మహిళలకు రక్షణ కల్పించాలని ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఎన్‌డి రవి, ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.శివ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట వున్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన తిరుపతిలో రాపిడో బైక్‌లకు అనుమతులు ఇవ్వడం వల్ల మహిళలకు రక్షణ కరువైందన్నారు. శ్రీవారి దర్శనం కోసం వచ్చిన మహిళలు బైక్‌లను బుక్ చేసుకొంటే జరుగరాని సంఘటనలు జరిగితే చెడ్డపేరు వచ్చే అవకాశాలు వున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు ఎస్.సురేష్, ఎం.వెంకటేష్, ఎపి.బాల, సతీష్ ప్రమీల, వాణి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి బ్రహ్మోత్సవాలకు పక్కా ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బరాయుడు, మురళీకృష్ణ

తిరుచానూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తెలిపారు .జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణతో కలిసి ఆయన మంగళవారం బ్రహోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. మాడవీధులు, పుష్కరిణి, హోల్డింగ్ పాయింట్,పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించి భద్రతా చర్యలపై పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జేఈవో వీరబ్రహ్మం మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 17నుంచి 25 వరకూ జరిగే బ్రహ్మోత్సవాలకు గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అన్నిశాఖల సమన్వయంతో టీటీడీ ఏర్పాట్లు చేస్తోందన్నారు. ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ పంచమీ తీర్థంనాడు వాహనాల పార్కింగ్ తోపాటు ప్రత్యేక క్యూలైను ద్వారా పుష్కరణిలో పుణ్యస్నానాలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీవీఎస్వో మురళీకృష్ణ తోపులాటలు జరగకుండా అన్ని జాగ్రత్తలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీ ప్రసాద్, డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, ఏఈవో దేవరాజులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విశ్వశాంతి పూజలు



పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే నాని

పాకాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉప్పరపల్లె పంచాయతీ నూరినేనివారిపల్లె శివాలయంలో గురప్ప స్వామికి ఎమ్మెల్యే పులివర్తి నాని మంగళవారం పట్టువస్త్రాలు సమర్పించారు. విశ్వశాంతి పూజల్లో భాగంగా మంగళవారం ఉదయం రుద్రాభిషేకం, లలితా పరమేశ్వరీదేవి లక్షకుంకుమార్చన, అన్నాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం జ్యోతిర్లింగ సహస్ర దీపాలంకరణ పూజలు చేశారు. బుధవారం రుద్రాభిషేకం, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ బుజ్జిబాబునాయుడు, అన్నప్రసాద దాతలు, కొంగర బాలాజీ, సునీత , ప్రదీప్, ఎస్.సుధాకర్, సుమతి, ఉభయదారులు ఎస్.పురుషోత్తం నాయుడు, సావిత్రి, ఎస్ నరేంద్ర పాల్గొన్నారు.

కాలువ పోరంబోకు స్థలం పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు,

తిరుపతిరూరల్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): వేదాంతపురం గ్రామపంచాయతీల్లో కాలువ పోరంబోకు స్థల వివాదం నేపథ్యంలో మండలసర్వేయర్, ఆర్‌ఐలు మంగళవారం సర్వేచేశారు. ఇరువురి దగ్గరున్న డాక్యుమెంట్లను సమర్పించాలని సూచించారు. స్థానికులు ప్రభుత్వమిచ్చిన ఇళ్ల పట్టాలను రెవెన్యూ అధికారులకు అందజేశారని తెలిసింది. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ..దోబీఘాట్ల రికార్డులను పరిశీలించి జిల్లా కలెక్టర్‌కి నివేదిస్తామన్నారు. అప్పటివరకూ ఇరువర్గాలు ఆస్థలంలోకి ప్రవేశించరాదన్నారు.

చెరకు సాగుపై గ్రంథావిష్కరణ



పాకాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చెరకు సాగుపై ప్రచురించిన గ్రంథాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. పాకాల, శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ మోహన్ బెహరా, డాక్టర్ సాయి వెంకటేష్‌లు ఎ బయోటిక్ స్ట్రెస్ రెస్పాన్సెస్ ఇన్ షుగర్ కేన్ వెరైటీస్ ఆఫ్ ఇండియా అనే గ్రంథాన్ని రచించారు. రచయితలను ప్రిన్సిపాల్ అధ్యాపకులు సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మాశిలామణి, అధ్యాపకులు ఈశ్వరబాబు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేఏ పాల్‌కు ఎక్కువ.. కమెడియన్‌కు తక్కువ

● భూమనపై ఎమ్మెల్యే ఆరణి ఎద్దేవా

తిరుపతి అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): 'ఆయన తిరుపతికి పట్టిన కరోనా. కేఏ పాల్‌కు ఎక్కువ, కమెడియన్‌కు తక్కువ' అంటూ భూమన కరుణాకరరెడ్డిపై ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మంగళవారం విమర్శించారు. 'గతంలో ఆరునెలలే పులికాట్‌లో కనిపించే ఫ్లెమింగో పక్షులు ఇటీవల ఏడాది పొడవునా కనిపిస్తున్నాయి. తుపాన్ ప్రభావం నుంచి వీటికి రక్షణ కల్పించేందుకు విడిది కేంద్రాలు, స్థిరంగా ఉండే నివాసాలు ఏర్పాటు చేసి ఏకో టూరిజం పెంపొందించాలి' అన్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలను ఆయన వక్రీకరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాటలను ప్రజలు పట్టించుకోరని, జోకర్‌గా చూస్తున్నారని ఎద్దేవా చేశారు. పులస చేపలకు ఫ్లెమింగో పక్షులకు లింకు పెట్టడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. చాలా పుస్తకాలు చదివాననే కరోనాకర్‌రెడ్డి పత్రికలను సరిగ్గా చదవడం నేర్చుకోవాలన్నారు. జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, హరిశంకర్, బాబ్జి, రాజేష్‌ఆచారి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిమెట్టు మార్గంలో దత్త విజయానందతీర్థస్వామి



చంద్రగిరి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మైసూరులోని దత్త పీఠానికి చెందిన ఉత్తరాధికారి దత్త విజయానందతీర్థ స్వామి మంగళవారం శ్రీవారిమెట్టు మార్గంలో తిరుమలకు వెళ్లారు. తొలుత శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం వంద మంది శిష్య బృందంతో ఆయన శ్రీవారిమెట్టు మార్గంలో కాలినడకన తిరుమలకు వెళ్లారు.

ప్రసూతి ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

● గర్భసంచి నుంచి భారీ కణితి తొలగింపు



కోలుకుంటున్న బాధితురాలు, చిత్రంలో వైద్యులు

తిరుపతి(వైద్యం), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆస్పత్రిలో లక్షలు వెచ్చించాల్సిన శస్త్ర చికిత్సను రూపాయి ఖర్చు కాకుండా చేసి ఓ మహిళను కాపాడారు ప్రభుత్వ ప్రసూతి వైద్యులు. వివరాలిలా.. కొన్నాళ్లుగా తీవ్ర రక్తస్రావంతో బాధపడుతున్న 33ఏళ్ల మహిళ సోమవారం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. సూపరింటెండెంట్ ప్రమీలా దేవి, ప్రొఫెసర్ అరుణ, డాక్టర్ ఉమాదేవిలు ఈమెను పరీక్షించారు. గర్భసంచిలో అతిపెద్ద స్థాయిలో గడ్డ ఉన్నట్లు గుర్తించారు. మంగళవారం వైద్యుల బృందం ఆ మహిళకు అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్స చేసి గర్భసంచి నుంచి భారీ కణితిని తొలగించారు. భవిష్యత్తులో గర్భసంచికి ఇబ్బంది తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నామని వైద్యులు తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇందుకు రూ. లక్షలు ఖరీదయ్యే శస్త్ర చికిత్సను ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చేశామని సూపరింటెండెంట్ తెలిపారు. ప్రస్తుతం మహిళ కోలుకుంటోందన్నారు. వైద్య బృందాన్ని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవిప్రభు అభినందించారు. సర్జరీలో వైద్యులు మధుసూధన్, విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థల్లో ప్రైవేటీకరణ తగదు



సదస్సులో మాట్లాడుతున్న జయశంకర్, యూనియన్ నేతలు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థల్లో ప్రైవేటీకరణ విధానాలను ప్రోత్సహిస్తోందని ఈఈ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. వేమన విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఏపీ విద్యుత్ ట్రేడ్‌యూనియన్ పోరాట కమిటీ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేటీకరణ విధానాలను అడ్డుకోడానికి కార్మికులంతా కలిసిరావాలన్నారు. కాంట్రాక్టు విధానాలతో ఎదురవుతున్న నష్టాలను వివరించాలన్నారు. ప్రభుత్వం విద్యుత్ సంస్థను మూడు భాగాలుగా చేసి నష్టాల్లోకి నెట్టిందన్నారు. యుఈఈయు రాష్ట్ర అధ్యక్షుడె సూరిబాబు, నాయకులు సుదర్శన్‌రెడ్డి, సుబ్బిరెడ్డి, ముస్తాఫ్‌అహ్మద్, ఎల్.రాజు, శివశంకర్, కందారపు మురళి ప్రసంగించారు.

వన్‌హెల్త్ వీక్ పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్‌వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి కలెక్టరేట్‌లో మంగళవారం వన్‌హెల్త్ వారోత్సవాలను పురస్కరించుకుని కలెక్టర్ వెంకటేశ్వర్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వన్‌హెల్త్ వీక్-2025 సందర్భంగా 9వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలందరూ భాగస్వాములై వ్యక్తిగత ఆరోగ్యాన్ని, జంత ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడటానికి కృషి చేయాలన్నారు. పర్యావరణ మార్పులు, జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధులు వంటి సవాళ్లను ఎదుర్కొవడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీసీ సెంటర్ వాసులకు బాలాజీనగర్‌లోనే నివాసం కల్పించాలి


టీటీడీ ఈవోతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుమల ఆర్బీసీ సెంటర్‌లో వాసులకు బాలాజీనగర్‌లో నివాసం కల్పించాలని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. మంగళవారం స్థానిక టీటీడీ పరిపాలన భవనంలో ఈవోతో ఎమ్మెల్యే భేటీ అయ్యి వివిధ అంశాలపై చర్చించారు. ప్రధానంగా ఆర్బీసీ సెంటర్‌లో నివసిస్తున్న 84మందిని తిరుపతికి తరలించాలని చేస్తున్న ప్రయత్నాలను మానుకొని తిరుమలలోనే స్థానం కల్పించడం సముచితమన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా మిగిలిన ఇళ్లకు స్లాబ్ వేయించాలన్నారు. శ్రీ వెంకటేశ్వర నాట్యకళాపరిషత్ రెన్యువల్ చేయడంతో పాటు ఏటా నాటకాల ప్రదర్శనకు కేటాయించే మొత్తాన్ని విడుదల చేయాలని కోరారు. వకుళమాత అన్నదాన ట్రస్టులో పనిచేస్తున్న కార్మికులకు టైంస్కేల్, లడ్డూ కార్డు, శ్రీవారి దర్శనం కల్పించాలన్నారు. దాంతో ఈవో సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, విశ్రాంత డిప్యూటీఈవో చిన్నంగారి రమణ, జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టాభికి స్వాగతం


పట్టాభిరాంను సత్కరిస్తున్న సుగుణమ్మ, ఆర్సీ మునికృష్ణ తదితరులు

తిరుపతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతికి వచ్చిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాంను మంగళవారం ఏపీజీబీసీ ఛైర్మన్ సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు అన్నా అనిత, చినబాబు, మన్నం శ్రీనివాసులు, ఊట్ల సురేంద్ర నాయుడు, ఎస్వీఎం శ్రీధర్, పాటకం వెంకటేష్, జగన్నాథం, కోటేశ్వరరావు, రేవతి, సూర్యకుమారి, తరుణ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి

ఎస్వీ గోశాలను పరిశీలించిన టీటీడీ ఈవో


గోశాలలోని గోవులను పరిశీలిస్తున్న టీటీడీ ఈవో

తిరుపతి(కల్చరల్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర గోశాలను మంగళవారం టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ పరిశీలించారు. గోశాల నిర్వహణ, గోవులకు అందుతున్న దాణా, వసతి, వైద్యం, తాగునీరు, పరిశుభ్రత తదితర అంశాలను ఈ సందర్భంగా ఇన్‌చార్జి డైరెక్టర్ డి.ఫణికుమార్ నాయుడు వివరించారు. అనంతరం గోవులకు ఆధునిక వసతులతో నిర్మిస్తున్న సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ భవనాన్ని, గోశాలలోని గోవులు, పేయదూడలు ఉంటున్న షెడ్లను ఈవో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అగరబత్తి యూనిట్‌ను తనిఖీ చేసి ఇక్కడి సిబ్బంది పలు సూచనలిచ్చారు.

డిస్కంలో ఉద్యోగుల క్రీడలకు సహకరిస్తా


సదరన్ డిస్కం సీఎండీ లోతేటి శివశంకర్‌ను సన్మానిస్తున్న టెన్నిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు

తిరుపతి (ఆటోనగర్), నవంబరు4(ఆంధ్యజ్యోతి): సదరన్ డిస్కంలో ఉద్యోగుల క్రీడలకు తగిన సహాయ సహకారాలను అందిస్తామని సంస్థ సీఎండీ లోతేటి శివశంకర్ అన్నారు. మంగళవారం కార్యాలయంలో ఏపీ ఎస్‌పీడీసీఎల్ టెన్నిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన క్యాదర్శులు అశోక్‌కుమార్, ఎల్.చలపతిల ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి సీఎండీని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యుత్ సంస్థలో క్రీడల వివరాలను ఆయనకు వివరించారు. కార్యాలయం సమీపంలో వున్న టెన్నిస్ కోర్టుకు చేపట్టాల్సిన అవసరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు విశ్రాంత సీజీఎం కేఆర్ఎస్ ధర్మజ్ఞాని, సీజీఎం ఎం.మురళీకుమార్, సీవీవో జనార్ధన్ నాయుడు, నరసింహ బాబు, జగన్, రాజు పాల్గొన్నారు.

బోర్డులో ఒక రేటు..లోపల మరో రేటు

● రైతు బజారులో దోపిడీ


టమోటాల దుకాణం

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతులకు, ప్రజలకు మేలు జరగాలని ఏర్పాటు చేసిన రైతు బజారులో దోపిడీ పెరిగిపోయింది. స్థానిక అన్నారావు సర్కిల్ సమీపంలోని రైతు బజారులో సోమవారం టమోటా ధర బోర్డులో మొదటి రకం రూ.25, రెండవ రకం రూ.20గా పెట్టారు. లోపలికి వెళ్లి చూడగా రూ.35, రూ.30గా విక్రయిస్తున్నారు. టమోటానే కాదు మిగిలిన కూరగాయలపైనా కిలోకు రూ.ఐదు నుంచి రూ.పది అదనంగా తీసుకుంటున్నారు. ఇక్కడ రైతులను పక్కకు నెట్టేసి కొందరు సంఘంగా ఏర్పడి బయట నుంచి కూరగాయలు తెచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. బోర్డులో ధర తక్కువగా ఉంది కదా అని ప్రశ్నిస్తే ఎదురుదాడి చేస్తూ అవమానపరుస్తున్నారని వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు. ఫిర్యాదు చేయాలంటే సంబంధిత అధికారి అందుబాటులో ఉండటం లేదని వాపోతున్నారు. ఈ విషయమై రైతు బజారు ఎస్టేట్ అధికారి అనిల్‌ను వివరణ కోరగా తను కార్యాలయంలో ఉన్నంత సేపు బోర్డు ధరతో విక్రయిస్తున్నారని, కార్యాలయ విధులపై బయటకు వెళ్లిన సమయంలో అధిక ధరలకు అమ్మి ఉంటారని తెలిపారు.

రహదారి భద్రతా ప్రమాణాలను తప్పక పాటించాలి

● జిల్లా రవాణాశాఖాధికారి మురళీమోహన్


ప్రైవేటు బస్సు ఆపరేటర్లకు సూచనలు ఇస్తున్న డీటీవో మురళీమోహన్

తిరుపతి(రవాణా), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతా ప్రమాణాలను డ్రైవర్లు తప్పక పాటించాలని జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ అన్నారు. మంగళవారం జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో రవాణా, పోలీసు శాఖలు సమన్వయంగా పాఠశాల, కళాశాలల యాజమాన్య ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డీటీవో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చోటు చేసుకుంటున్న రహదారి ప్రమాదాల నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. విద్యాసంస్థల యాజమాన్యాలు తమ డ్రైవర్లపై నిరంతర పర్యవేక్షణ కలిగి ఉండాలని, రహదారి భద్రత నిబంధనలపై వారికి అవగాహన కల్పించాలన్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను ఎప్పటికపుడు రెన్యువల్ చేయించుకోవాలని, బస్సుల్లో అన్ని భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. లేనిపక్షంలో రవాణాశాఖ, పోలీసు శాఖ సంయుక్తంగా నిర్వహించే తనిఖీల్లో పట్టుబడితే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. బస్సుల్లో వేగపరిమితి పరికరం, జీపీఎస్ ట్రాకింగ్ పరికరాలు, అత్యవసర ద్వారం, అగ్నిమాపక పరికరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా అనే విషయాలపై నిరంతరం తనిఖీ ఉండాలన్నారు. విద్యార్థుల ప్రాణ భద్రతపై నిర్లక్ష్యం చేస్తే నిర్వాహకులపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ట్రాఫిక్ సీఐ భాస్కర్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులను తరలించే వాహనాలు నిర్దేశిత వేగపరిమితులు పాటించాలని, స్కూల్ పరిసరాల్లో హెచ్చరిక బోర్డులు, జీబ్రా క్రాసింగ్, పార్కింగ్ సూచనలు ఏర్పాటు చేయాలని యాజమాన్యాలకు విజ్ఞప్తిచేశారు. ఈ సమావేశంలో ఎంవీఐలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, అతికానాజ్, ఏవో విజయప్రశాంతి, పాఠశాల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కోట, వాకాడు, చిల్లకూరు, గూడూరు, డీవీసత్రం మండలాలకు సంబంధించిన గిరిజనుల సమస్యలపై మంగళవారం కలెక్టరేట్‌లో తహసీల్దారు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులతో వర్చువల్ విధానంలో కలెక్టర్ వెంకటేశ్వర్ సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనులకు జీవనోపాధి, తాగునీరు, పక్కా ఇల్లు, ఇంటి స్థలాలు, భూమి సమస్యలు, అటవీహక్కుల కింద ఇచ్చే పట్టాలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, పాఠశాల ప్రహరీ తదితర సమస్యలపై గిరిజనులు ఇచ్చిన అర్జీలను నిశితంగా పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రవినాయుడు, డీఈవో కేవీఎస్‌కుమార్, డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, డీపీవో సుశీలాదేవి తదితర అధికారులు పాల్గొన్నారు.

సైకాలజీ ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డిని

సస్పెండ్ చేయాల్సిందే

● రౌండ్ టేబుల్ సమావేశంలో విద్యార్థి సంఘాల డిమాండ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ సైకాలజీ విభాగంలో ర్యాగింగ్‌ను ప్రోత్సహించిన ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డిని సస్పెండ్ చేయాలని అఖిలపక్ష విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ విషయమై విద్యార్థి సంఘాలు మంగళవారం యూనివర్సిటీలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సైకాలజీ విభాగంలో జూనియర్ విద్యార్థులపై సీనియర్ల ర్యాగింగ్‌ను ప్రోత్సహించిన ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డిని కనీసం రెండేళ్ల పాటు సస్పెండ్ చేయాలని కోరారు. ఈ ఘటనపై విచారణ కమిటీ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. విచారణ కమిటీ నివేదికను పారదర్శకంగా రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. తరగతి గదుల్లోని సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించి, వాటి ఆధారంగా కేసులు నమోదు చేయాలన్నారు. సీసీ ఫుటేజీలను విద్యార్థి నాయకులకు చూపించాలని కోరారు. ఇకపై యూనివర్సిటీలోని ఏ విభాగంలోనూ ఐసీ క్లాసులు నిర్వహించకుండా అధికారులు తక్షణం ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డిని సస్పెండ్ చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వర్సిటీల కన్వీనర్ అశోక్‌కుమార్, ఎస్వీయూ కార్యదర్శి వినోద్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి జెన్నే మల్లికార్జున, పీడీఎస్‌వో జిల్లా కార్యదర్శి ఆశ, గిరిజన విద్యార్థి సంఘ నేత శివశంకర్ నాయక్, లా స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడు సుందరరాజు, జేబీఎస్ఎఫ్ సీమ ప్రాంత కన్వీనర్ భార్గవ్ సాయి తదితరులు పాల్గొన్నారు. సైకాలజీ విభాగ ఘటనపై విద్యార్థి సంఘాల ఆందోళన నేపథ్యంలో యూనివర్సిటీలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. సైన్స్‌కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయం వద్దకు వచ్చిన వివిధ విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఓ దశలో విద్యార్థి సంఘాల నేతలు పోలీసులతో వాగ్వివాదం చేశారు. వెస్ట్ సీఐ మురళీమోహన్ జోక్యం చేసుకొని వారిని శాంతింప చేశారు.


అఖిలపక్ష విద్యార్థి సంఘాల నేతల సంఘీభావం

ఉపకులపతికి విచారణ కమిటీ నివేదిక

శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో సైకాలజీ విభాగంలో ర్యాగింగ్ సంఘటనపై విశ్వవిద్యాలయం అధికారులు స్పందించారు. విద్యార్థుల ఫిర్యాదు మేరకు విచారణ కమిటీని వేశారు. మంగళవారం విచారణ కమిటీ సమావేశమై, విచారణ చేసి తమ రిపోర్టును సీల్డు కవర్లో వుంచి, విశ్వవిద్యాలయానికి సమర్పించింది. ఈ రిపోర్టును విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య నర్సింగరావు వచ్చిన వెంటనే పరిశీలించి తప్పుచేసిన వారిపై తగిన చర్యలు తీసుకుంటారని ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ప్రత్యేక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు న్యాయం చేయండి

- టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత వినతి

ఎస్వీయూ సైకాలజీ విభాగంలో చోటు చేసుకున్న ఘటనకు పాల్పడిన సీనియర్ విద్యార్థులు, ర్యాగింగ్‌ను ప్రోత్సహించిన ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డిపై చర్యలు తీసుకోవాలని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి రాగల ఆనంద గౌడ్, టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ కోరారు. వేగంగా విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై మంత్రి నారా లోకేష్‌ను విజయవాడలో కలిసి హేమంత్‌రాయల్ విన్నవించారు. ర్యాగింగ్‌కు పాల్పడకుండా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి నారా లోకేష్ ఆదేశించారు.


నారా లోకేష్‌తో హేమంత్

తిరుమల దుకాణాల్లో సంప్రదాయ ఆహారం

- టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి



తిరుమల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని దుకాణాల్లో భక్తులకు సాంప్రదాయ ఆహారాన్ని అందించేలా ప్రణాళికలు రూపొందించాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. తిరుమలలోని పద్మావతి అతిథిగృహంలో పలు విభాగాల అధికారులతో మంగళవారం ఆయన సమావేశం అయ్యారు. తిరుమలలో ఔషధ వనాన్ని ఏర్పాటు చేయాలన్నారు. హెల్త్ విభాగం, ఎఫ్ఎంఎస్ సేవలు, తిరుమలలో వివిధ ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఎల్ఈడీ బోర్డులు, శ్రీవారిసేవ, వైద్యం, ఐటీ, కల్యాణకట్ట విభాగాల పనితీరుపై కూడా సమీక్షించారు.

స్వామి వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

● ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(అర్బన్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నేటితరం యువతీ యువకులు స్వామి వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సూచించారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యువజనుల సర్వీసుల శాఖ (సెట్విన్) ఆధ్వర్యంలో స్థానిక ఎల్ఐసీ రోడ్డులోని ఎమరాల్డ్ డిగ్రీ కళాశాలలో యువజనోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ... సంప్రదాయ కళలను భావితరాలకు అందించాలని, క్రీడలపట్ల ఆసక్తి పెంచుకోవాలని పిలుపునిచ్చారు. సెట్విన్ సీఈవో పి.యశ్వంత్ మాట్లాడుతూ... యువతలో నైతిక విలువలను పెంపొందించేలా సెట్విన్ ఆధ్వర్యంలో యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ బాలానాయక్, జిల్లా పశువైద్య శాఖాధికారి డాక్టర్ ఎ.రవికుమార్ మాట్లాడుతూ.. యువతీ యువకులు సామాజిక సేవలో, దేశ నిర్మాణంలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. యువజనోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అలాగే కథారచన, పెయింటింగ్, కవిత్వం తదితర పోటీలు నిర్వహించారు.


సాంస్కృతిక ప్రదర్శనలు చేసిన కళాకారులతో ఎమ్మెల్యే ఆరణి

ఘనంగా ఎస్వీయూ ఇంటర్ కాలేజీ అథ్లెటిక్ పోటీలు


మెన్ ఇన్‌స్టిట్యూషనల్, ఉమెన్ ఇన్‌స్టిట్యూషనల్ విజేతలు

తిరుపతి(క్రీడలు), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఇంటర్ కాలేజీ అథ్లెటిక్ పోటీలు మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు హోరాహోరీగా జరిగాయి. ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.శివశంకరరెడ్డి ఆధ్వర్యంలో ఎస్వీ తారకరామ మైదానంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్ మీట్‌ను రెక్టార్ ప్రొఫెసర్ సీ.హెచ్.అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్వీయూ పరిధిలోని 20కాలేజీల నుంచి 20జట్లు ప్రాతినిధ్యం వహించాయి. పోటీలు ముగిసిన తరువాత రాణించిన క్రీడాకారులకు ఆయన ఓవరాల్ చాంపియన్‌షిప్, విన్నర్, రన్నర్స్‌కు ట్రోఫీ, ప్రశంసాపత్రాలు అందజేశారు.

● పురుష వ్యక్తిగత సంయుక్త చాంపియన్‌షిప్స్‌గా డి.సింధూర్(ఎస్వీసీసీ డిగ్రీకాలేజీ, తిరుపతి), ఎం.సుదర్శన్ నాయక్(ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, తిరుపతి).

● మహిళా వ్యక్తిగత సంయుక్త చాంపియన్‌షిప్స్‌గా కె.గాయత్రి(బీపీఈడీ, ఎస్వీయూ కాలేజీ, తిరుపతి), బీభవ్యశ్రీ(ఎస్వీడబ్ల్యూ డిగ్రీకాలేజీ, తిరుపతి).

● మెన్ ఇన్‌స్టిట్యూషనల్ జాయింట్ చాంపియన్‌షిప్‌గా ఎస్వీసీసీ డిగ్రీకాలేజీ, తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ తిరుపతి.

● ఉమెన్ ఇన్‌స్టిట్యూషనల్ జాయింట్ చాంపియన్‌షిప్‌గా ఎస్వీడబ్ల్యూ డిగ్రీ అండ్ పీజీ కాలేజీ తిరుపతి.

మూఢవిశ్వాసాలు లేని సమాజాలే అభివృద్ధి చెందుతాయి

తిరుపతి(విద్య), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మూఢ విశ్వాసాలు లేని సమాజాలే అభివృద్ధి చెందుతాయని తిరుపతి అర్బన్ ఎంఈవో బాలాజీ పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో ప్రతీ ఏటా నిర్వహించే చెకుముకి సంబరాలు, టాలెంట్ టెస్ట్ మంగళవారం స్థానిక లిటిల్ ఏంజెల్స్ పాఠశాలలో ఘనంగా జరిగాయి. పట్టణ, మండలస్థాయిలో జరిగిన టాలెంట్ టెస్టుకు ముఖ్య అతిథిగా హాజరైన బాలాజీ మాట్లాడుతూ నిత్యం మనంచేసే పనులన్నింటిలో సైన్స్ ఉంటుందంటూ విద్యార్థులు మూఢ విశ్వాసాలను నమ్మరాదని వివరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రముఖ మెజీషియన్ విజయ్‌కుమార్ మ్యాజిక్ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ప్రముఖ గాయకులు ఆమూరి సుబ్రహ్మణ్యం జేవీవీ పాటలతో అలరించారు. అరసం జిల్లా కార్యదర్శి నెమిలేటి కిట్టన్న కథా రచన ఎలా చేయాలో వివరించారు. హెల్పింగ్ టు అదర్స్ కార్యకర్త మణికంఠ, టీటీడీ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాస్, జేవీవీ గౌరవాధ్యక్షులు, కిరణ్‌స్కూల్ అధినేత జయరామిరెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి విరాళంగా వెండి గంగాళం



తిరుమల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి మంగళవారం వెండి గంగాళం విరాళంగా అందింది. హైదరాబాద్‌కు చెందిన జక్కారెడ్డి శ్రీనివాసులురెడ్డి అనే భక్తుడు 22 కేజీల బరువున్న రూ.30 లక్షల విలువైన గంగళాన్ని టీటీడీ అధికారులకు అందజేశారు. అంతకుముందు అదనపు ఈవో వెంకయ్య చౌదరిని ఆయన కలిసి వివరించారు.

తిరుపతి శ్రీకాలేజీ స్థానంలో యూనివర్శిటీ




● తెలంగాణ ఎమ్మెల్యే మల్లారెడ్డి

తిరుమల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శ్రీకాలేజీని కొనుగోలు చేశానని, ఈస్థానంలో యూనివర్సిటీ పెట్టాలనే కోరికతో తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శించుకుని మొక్కుకున్నట్టు తెలంగాణ ఎమ్మెల్యే మల్లారెడ్డి తెలిపారు. తిరుమల శ్రీవారిని మంగళవారం ఉదయం దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశమంతా యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలనే ఆలోచనతో వైజాగ్‌లో ఇప్పటికే యూనివర్శిటీ నెలకొల్పామన్నారు. తిరుపతి శ్రీ ఇంజనీరింగ్ కాలేజీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తయిందని తెలిపారు. మల్లారెడ్డి మాట్లాడుతుండగా కొందరు 'జై తెలంగాణ' అంటూ నినాదాలు చేశారు.

నేడు కార్తీక పున్నమి గరుడ సేవ

తిరుమల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమలలో బుధవారం గరుడవాహనంపై శ్రీమలయప్పస్వామి దర్శనమివ్వనున్నారు. ప్రతి నెలా పౌర్ణమిరోజున టీటీడీ గరుడసేవను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. బుధవారం కార్తీక పౌర్ణమి కావడం విశేషం. రాత్రి 7 గంటలకు వాహనసేవ ప్రారంభంకానుంది.

సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 15 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.74 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,322

తలనీలాలు సమర్పించినవారు: 26 వేలు

విడిదికి వేళాయె!

వలస పక్షులకు స్వాగతం పలుకుతున్న నేలపట్టు





గూళ్ళు సర్దుకుంటూ

వైట్‌ఐబీస్(తెల్లకంకణాయి)



పుల్లలు ఏరుకుంటూ

ఓపెన్ బిల్డ్‌స్టార్క్స్(నత్తగుల్ల కొంగలు)

దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

వలసపక్షుల విడిది కేంద్రం నేలపట్టులో సందడి మొదలైంది. వేల కిలోమీటర్ల దూరాల నుంచి ఎగురుకుంటూ వస్తున్న పక్షులకు స్వాగతం పలుకుతోంది. అక్టోబరు 20 తర్వాత పక్షుల రాక పలుచగా మొదలైనా వారం నుంచీ వీటి సంఖ్య పెరిగింది. నిజానికి అక్టోబరు మొదటి వారం నుంచే వలసవిహంగాల రాక మొదలు కావాలి. నేలపట్టు చెరువుల్లోని పచ్చని కడప చెట్ల మీద తెల్లని పత్తిపూలలా కొంగలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది వానలు బాగా కురిశాయి. చెరువులు కళకళలాడుతున్నాయి. పులికాట్ సరస్సుకూడా నీటితో నిండుగా ఉంది. దీంతో ఈ యేడాది పెలికాన్ పక్షుల సంఖ్య భారీగా ఉంటుందని అటవీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆస్ట్రేలియా, శ్రీలంక, దక్షిణాఫ్రికా దేశాల నుంచి పెలికాన్ పక్షులు నేలపట్టుకు వస్తాయి. కడప చెట్లపై గూళ్లు అల్లుకుని, జత వెతుక్కుని, గుడ్లు పెట్టి, పొదిగి తమ సంతతి వృద్ధి చేసుకొంటాయి. నేలపట్టు చెరువుల్లోని చెట్లమీద అయిదారు నెలలపాటూ ఉండే పక్షులు, తెల్లవారగానే రెక్కలు విప్పుకుని ఇక్కడికి 10 నాటికల్ మైళ్ళ దూరంలోని పులికాట్ సరస్సులోకి వెళ్లిపోతాయి. ఈ కాలంలో చేపలూ, రొయ్యలూ పులికాట్‌లో సంవృద్ధిగా ఉంటాయి. కడుపు నిండా తిని తమ మెడకింది గూళ్లలో మత్స్యఆహారం దాచుకుని సాయంత్రానికి తిరిగి నేలపట్టుకు చేరుకుని విశ్రమిస్తాయి. ప్రస్తుతం ఎండిన పుల్లలు ఏరుకుంటూ, గూళ్లకు చేరుస్తూ, ఈదులాడుతూ, నింగిలో విన్యాసాలు చేస్తూ జతను ఆకర్షిస్తూ నేలపట్టులో సందడి చేస్తున్నాయి. నీటి అడుగు భాగంలో దొరికే పీచులాంటి గడ్డిని సేకరించి గూళ్లలో మెత్తగా పరచుకుంటున్నాయి. పక్షుల రాక ప్రారంభం కావడంతో స్థానిక వన్యప్రాణి సంరక్షణ శాఖ అధికారులు సందర్శకులను అనుమతిస్తున్నారు.




ప్రేమకలాపాలు

విడిదికి చేరుకున్న పక్షులు ఇవీ

పక్షి పేరు	2024	2025
	(నవంబర్ 1 నాటికి)	
పెలికాన్స్ (గూడబాతులు)	921	1026
ఒపన్ బిల్డ్ స్టార్క్స్(నత్తగుల్లకొంగలు)	1547	2384
వైట్ ఐ బీస్(తెల్లకంకణాయి)	1364	1064
లిటిల్ కార్మోరెంట్స్ (చిన్ననీటి కాకులు)	432	622
స్పూన్ బిల్స్ (తెడ్డుమూతి కొంగలు)	02	52
మొత్తం	4266	5148



జతను ఆకర్షించే విన్యాసాలు



పెలికాన్ జంట విహారం



పక్షుల రాక మొదలవడంతో సందర్శనకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే పక్షుల కేంద్రంలోని అన్నీ ర్లోను శుభ్రపరిచే పనులు ప్రారంభించాం. పక్షుల సంఖ్యతో పాటు, సందర్శకుల సంఖ్య కూడ రోజు రోజుకీ పెరుగుతుంది. నేలపట్టు ఆహ్లాదకరమైన ప్రదేశం. ప్రశాంతంగా పక్షుల విన్యాసాలు వీక్షించవచ్చు.

- ఎ. సౌజన్య, నేలపట్టు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్



గూళ్లలో విశ్రాంతి



కడప చెట్లపై కొలువు దీరిన వలస పక్షులు



లిటిల్ కార్మోరెంట్స్(చిన్న నీటి కాకులు)

పంచాయతీనిధుల దుర్వినియోగంపై ఇరువర్గాల ఘర్షణ

● ఇద్దరికి గాయాలు



శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చెంచుబాబు

కేవీబీపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పవనివారికండ్రిగలో పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారంటూ ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాలు... పవనివారికండ్రిగకు చెందిన శ్రీనివాసులు అలియాస్ వాసు గ్రామంలో పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని ఈనెల 3న సోమవారం చర్చించడంపై సర్పంచు వర్గానికి చెందిన చెంచుబాబు మధ్య వాగ్వాదం జరిగింది. మంగళవారం ఉదయం వాసు పెద్దమ్మ బుజ్జమ్మ తన మరిది వెంకటేశ్వర్లును ఎందుకు బెదిరించారంటూ నిలదీశారు. ఈక్రమంలో మునిరామయ్య, చెంచుబాబు, చెంచుకృష్ణ తదితరులు శ్రీనివాసులు చిన్నాన్న సుబ్రహ్మణ్యంపై దాడి చేశారు. శ్రీనివాసయాదవ్ అడ్డుపడగా అతనిపై కూడా కర్రలతోదాడి చేశారు. ఈ దాడుల్లో శ్రీనివాసయాదవ్, చెంచుబాబు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పుత్తూరు డీఎస్పీ రవికుమార్, సీఐ రవీంద్ర, పిచ్చాటూరు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ నరేష్ సిబ్బందితో గ్రామానికి చేరుకుని పరిస్థితిని సర్దుబాటు చేశారు. క్షతగాత్రులను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ముందస్తు చర్యగా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.



శ్రీనివాసయాదవ్

బీజేపీ జెండాతో తిరుమలకు కారు



పార్టీ జెండాతో ఉన్న కారు

తిరుమల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ పార్టీ జెండాతో మంగళవారం ఓ కారు తిరుమలలో కనిపించింది. అలిపిరి తనిఖీలను దాటుకుని బీజేపీ జెండాతో తిరుమలకు చేరుకున్న కారు వరాహస్వామి విశ్రాంతి భవనం వద్ద కనిపించింది.

వైద్యాధికారి తీరుపై విచారణ

వెంకటగిరి, నవంబర్ 4(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ప్రభుత్వాస్పత్రి ఇన్‌చార్జి వైద్యాధికారి జిలానీ బాషా తీరుపై మంగళవారం విచారణ జరిగింది. రోగులకు సరైన వైద్యం అందిచడం లేదని, సహచర వైద్యులు, సిబ్బందిని వేధింపులకు గురిచేస్తున్నారని జిలానీ బాషాపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఇటీవల ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆ సమయంలో వైద్యాధికారి జిలానీ బాషా తీరుపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉన్నతాధికారుల బృందం ఆస్పత్రికి చేరుకొని విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది, జిలానీ బాషా వేధింపుల గురించి అధికారుల బృందానికి వివరించారని సమాచారం. సిబ్బంది చెప్పినవి విషయాలు నమోదు చేసుకోవడంతో పాటు ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించి నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు విచారణాధికారులు తెలిపారు. ఈ విచారణ బృందంలో గూడూరు ఏరియా ఆస్పత్రి సివిల్ సర్జన్ డి.రాజా, పరిపాలనా అధికారి బి.కమల్ కిరణ్, సూళూరుపేట ఏరియా ఆస్పత్రి జూనియర్ అసిస్టెంట్ ఎల్‌కే కరీనా ఉన్నారు.



వైద్యాధికారి జిలానీ బాషాతో మాట్లాడుతున్న విచారణాధికారులు

హైవే, రైల్వే ప్రాజెక్టు భూసేకరణ పనులు వేగవంతం చేయండి

● అధికారులకు కలెక్టర్ ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, వైజాగ్ - చెన్నై కారిడార్ పైపులైను పనులు, పలు భూసంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళిక బద్ధంగా నిర్ణీత గడువు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. తిరుపతి కలెక్టరేట్‌లో మంగళవారం తిరుపతి, నెల్లూరు, చెన్నై నేషనల్ హైవే పీడీలు, ఆర్డీవోలు తదితర అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు, వైజాగ్ - చెన్నై కారిడార్ పైపులైను పనులు, రైల్వే ప్రాజెక్టు పనులు, పురోగతిలో ఉన్న పనులపై రేణిగుంట, పూడి, గూడూరు, రేణిగుంట, పాకాల, తిరుపతికి సంబంధించి రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. పెండింగ్ భూసమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీవోలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామ్మోహన్, కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డి, తిరుపతి, నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లు విజయభరత్‌రెడ్డి, శివకుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

జిల్లా యంత్రాంగానికి అభినందనలు

మొంథా తుఫాన్ సహాయక చర్యల్లో పాల్గొని సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేసిన జిల్లా యంత్రాంగానికి కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. రానున్న రెండు నెలలు ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, వ్యవసాయశాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన ప్రతి అర్జీని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీ రోజ్మాండ్, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

మరింత సమర్థంగా వ్యర్థాల నిర్వహణ

● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్

తిరుపతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌ను మరింత అభివృద్ధి చేస్తున్నామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. మంగళవారం పద్మావతి అతిథి గృహంలో నగరపాలక సంస్థ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. చెత్త సేకరణ, తరలింపు, ప్రాసెసింగ్ తదితర విషయాలను డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌లు ఆయనకు వివరించారు. అనంతరం పట్టాభిరామ్ మీడియాతో మాటాడుతూ గత ప్రభుత్వం వదిలేసిన కొన్ని వేల టన్నుల చెత్తను శుభ్రం చేస్తున్నామన్నారు. చెత్త శుభ్రం చేసిన ప్రాంతాలను సుందరమైన పార్కులుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఏపీజీబీసీ చైర్మన్ సుగుణమ్మతో కలసి పార్కులు పెంచి ప్రజలకు ఆహ్లాధకరమైన వాతావరణం తెచ్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు. తూకివాకంలోని ఇంటిగ్రెటెడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌ను తమ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. రీసైక్లింగ్ ఫ్యాక్టరీలు కూడా తిరుపతి ప్రాంతాల్లో రానున్నాయని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మునిసిపల్ ఇంజినీర్ తులసికుమార్, డీఈ రమణ, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.

21 కిలోల గంజాయి స్వాధీనం ఒడిశాకు చెందిన ఇద్దరి అరెస్టు



గంజాయి, నిందితులతో సీఐ సంగమేశ్వరరావు, ఎస్‌ఐ నాగరాజు

పెళ్లకూరు, నవంబరు, 4 (ఆంధ్రజ్యోతి): బేల్దారి పనుల ముసుగులో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఒడిశాకు చెందిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు... పెళ్లకూరు మండలంలోని 71వ జాతీయ రహదారిలో తాళ్వాయిపాడు అండర్ పాస్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని సోమవారం సాయంత్రం ఎస్‌ఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ఒడిశా రాష్ట్రం, కలహండి జిల్లా, పండకమాల్ గ్రామానికి చెందిన గోపీనాథ్ బీబార్, మితిన్ బీబార్‌గా తెలిసింది. వారివద్ద నుంచి 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తిరుపతిలో బేల్దారు పనులు చేసుకుంటున్న పండకమాల్ గ్రామానికి బలరాం వద్ద గోపీనాథ్ బీబార్, మితిన్ బీబార్ ఇటీవల పనిలో చేరారు. గంజాయి అక్రమ రవాణా చేసి ఎక్కువ డబ్బు సంపాదించవచ్చని సాబీర్ అనే వ్యక్తి వీరికి ఆశ చూపాడని విచారణలో తెలిసింది. నిందితులు ఇద్దరినీ నాయుడుపేట కోర్టులో హాజరుపరచినట్లు సీఐ తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



జస్టిస్ ఈశ్వరయ్య

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య, ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఉన్నారు.

-తిరుమల, ఆంధ్రజ్యోతి



నిమ్మగడ్డ రమేష్‌కుమార్

పుత్తూరు వార్తలు

షార్ట్ సర్క్యూట్‌తో పూరి గడిసె దగ్ధం

● బాధితులకు ఎమ్మెల్యే సాయం



నిత్యావసరాలు, నగదు అందిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్ తదితరులు

పుత్తూరు అర్బన్, నవంబర్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తడుకు పంచాయతీ వీఎస్ఎస్‌పురంలో షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధమైంది. మంగళవారం వేకువజామున ఈ ప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన వెంకటేష్ కుటుంబం నిద్రిస్తుండగా వేకువజామున గుడిసెకు మంటలు అంటుకోవడంతో పరుగున వెలుపలికి వచ్చి ప్రాణాలను కాపాడుకున్నారు. చుట్టుపక్కల వారు స్పందించే లోగా గుడిసె పూర్తిగా కాలిపోయింది. నిత్యావసరాలు, గృహోపకరణాలు, ఇతర వస్తువులు కాలి బూడిదయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. తక్షణం ఆ కుటుంబానికి ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర వస్తువులు అందజేశారు. పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు అరవ బాలాజీ, సర్పంచ్ బొబ్బిలి యాదవ్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

పుత్తూరు టౌన్ (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గేటు పుత్తూరుకు చెందిన ఇస్మాయిల్ గుండెజబ్బుతో ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సీఎం సహాయ నిధి రూ.4.50 లక్షల చెక్కును అందించారు. నబీ, డి.మహమ్మద్, రఫీ, కరీం అలీషా, శంషు, యాక్బల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్లీడర్‌కు సన్మానం



వడమాలపేట, నవంబరు 4(ఆంధ్ర జ్యోతి): న్యాయవాది వృత్తిలో ఉంటూ ప్రభుత్వ ప్లీడర్‌గా ఎంపికైన దశరథను మిత్రులు ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992-93లో టెన్త్ చదివిన సహచర విద్యార్థులు దశరథను మంగళవారం సన్మానించారు. నిరుపేద కుటుంబంలో పుట్టి ఉన్నతస్థాయికి ఎదగడం సంతోషకరమని కొనియాడారు. కె.హరిహరరావు, మురళి, వేణు, హరి, న్యాయవాది నాదముని తదితరులు ఏర్పాట్లు చేపట్టారు.

సాగు భూములపై అటవీశాఖ దౌర్జన్యం ఆపాలి

నారాయణవనం, నవంబర్ 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెత్తల తడుకు దళితుల సాగులో ఉన్న భూములపై అటవీ శాఖ అధికారుల దౌర్జన్యం ఆపాలని ఏపీ వ్యవసాయ కార్మికసంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్దన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన వెత్తల తడుకు వద్ద దళితుల భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ 100 ఎకరాలను 100 కుటుంబాలకు ఇచ్చిన ఆర్డర్‌ను అమలు చేయకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి శత జయంతి

పిచ్చాటూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేలూరులో మంగళవారం సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కిలారి నాగభూషణం నాయుడు, ప్రమీలమ్మ ఆధ్వర్యంలో సత్యసాయి పల్లకిసేవ నిర్వహించారు. పుట్టపర్తి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తికి చెందిన భక్తులు కోలాటం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. అనంతరం చీరలు పంపిణీ చేశారు.

వీధి వ్యాపారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

శ్రీకాళహస్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణన్ అన్నారు. పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో వీధి వర్తక వ్యాపార సంఘం జిల్లా సమావేశం జరిగింది. ఒక వైపు పురపాలకసంఘం, మరో వైపు ట్రాఫిక్ పోలీసులతో వీధి వర్తక వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. శివకుమార్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలుగు యువత నాయకుడి జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి తెలుగు యువత నాయకుడు, ఐ టీడీపీ నియోకవర్గ అధ్యక్షుడు ఖాదర్‌వలీ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే సుధీర్ తల్లి బృందమ్మ సమక్షంలో కేక్ కట్ చేసి నాయకులు, అభిమానులకు పంచిపెట్టారు. ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు. కాగా ఫోన్‌ద్వారా ఎమ్మెల్యే సుధీర్ దంపతులు కూడా ఖాదర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాజీ కౌన్సిలర్ బషీర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

స్తంభాల గిరీశ్వరుడి ఆలయంలో భక్తులకు మెరుగైన వసతులు

డక్కిలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని దేవునివెల్లంపల్లిలోని స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయంలో భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురవకుండా మెరుగైన వసతులు కల్పించాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన ఆలయంలో క్యూలైన్లు, ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి సందర్భంగా స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని, నిర్దేశించిన క్యూలైన్లలోనే వెళ్లి స్వామివారి దర్శనం చేసుకోవాని సూచించారు. రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో భక్తులు సమన్వయంతో వేచివుండాలన్నారు.

రైతుల పక్షపాతి సీఎం చంద్రబాబు

కోట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు రైతు పక్షపాతి అని వాకాడు వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ మర్రి ప్రమీల, నెల్లూరుపల్లి కొత్తపాళెం సహకార సంఘ చైర్మన్ ఉచ్చూరు రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం సహకార సంఘ కార్యాలయంలో మంగళవారం రైతులకు యూరియాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రమీల, రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియాను రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పెన్నక్క చెరువు ఆయకట్టు అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ నారాయణ, దారా సురేష్, సొసైటీ డీఈవో గోపి, ఏవో సుచేంద్రప్రసాద్, భూషణ్ పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు అండగా ప్రభుత్వం

చిల్లకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధితులకు ఎన్డీఏ ప్రభుత్వం అండగా నిలుస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తిక్కవరం గ్రామంలో మొంథా తుఫాన్ కారణంగా పునరావాస కేంద్రాల్లో ఉన్న కుటుంబాలకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ సమయంలో గ్రామంలోని 75కుటుంబాల వారిని పునరావాస కేంద్రానికి తరలించడం జరిగిందన్నారు. వారికి వారందరికీ రూ.1000 చొప్పున నగదు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచు సతీష్‌రెడ్డి, ఉపసర్పంచు ఆవుల ప్రభాకర్, వీఆర్‌వో తదితరులు పాల్గొన్నారు.

గూడూరు సూళ్లూరుపేట/వెంకటగిరి

స్టార్టర్ల చోరీ

పెళ్లకూరు, నవంబరు, 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో నెలబల్లి, భీమవరం గామాల్లో మంగళవారం తెల్లవారుజామున వ్యవసాయ బోరు బావుల వద్ద స్టార్టర్లను దుండగులు అపహరించుకుని వెళ్లారు. రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుమారు 15 స్టార్టర్లు, రాగి వైర్లను దుండగులు అపహరించుకుని వెళ్లారని, నాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్న సమయంలో స్టార్టర్ల చోరీ జరగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలబల్లి, భీమవరం, జీలపాటూరు, చిల్లకూరు, కప్పగుంటకండ్రిగ, చావాలి తదితర గ్రామాల పొలాల్లో తరచూ స్టార్టర్లు, రాగి వైర్లు చోరీకి గురవుతువడడం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు.

వివాదాస్పద భూమి పరిశీలన

సూళ్లూరుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేసియన్‌గుంటలో వివాదాస్పద భూమిని మంగళవారం తహసీల్దార్ గోపినాథ్ రెడ్డి పరిశీలించారు. కేసియన్‌గుంట సర్వే నెంబరు 51-1ఏలో భూమి విషయమై ఇరువర్గాల నడుమ వివాదం తలెత్తడంతో రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. మంగళవారం తహసీల్దార్ సదరు భూమి వద్దకు చేరుకుని ఇరువురి రికార్డులను పరిశీలించారు. సర్వేచేయించి వివాదాన్ని పరిష్కరిస్తామని, అప్పటి వరకు భూమిలోకి ఎవరు ప్రవేశించవద్దని తహసీల్దారు సూచించారు. ఆయన వెంట ఎస్ఐ బ్రహ్మనాయుడు, వీఆర్వో ఉన్నారు.

ఎప్పుడు కూలుతాయో!

శిథిలావస్థలో మంచినీటి ట్యాంకులు



రామాపురం పంచాయతీ ఎస్ఆర్ కండ్రిగ గ్రామంలో శిథిలావస్థలో ఉన్న ట్యాంక్



భీములవారిపాళెంలో పెచ్చులూడిపోయిన ట్యాంక్

తడ, నవంబరు, 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలో గ్రామీణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని ట్యాంకులు కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. తడ మండలంలో 11, సూళ్లూరుపేటలో 8, దొరవారిసత్రంలో 5, నాయుడుపేటలో 5, పెళ్లకూరు మండలంలో 2 ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని ట్యాంకుల బేస్ పిల్లర్లు సైతం పెచ్చులూడిపోయి ఇనుప ఊచలు బయటపడ్డాయి. శిథిలావస్థలో ఉన్న ట్యాంకుల సామర్థ్యాన్ని నిర్ధారించి ధ్రువీకరించే బాధ్యతలను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు అప్పగించారు. ఇందుకోసం ఒక్కొక్క ట్యాంకుకు రూ.9వేలు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం ట్యాంకుల సామర్థ్యాన్ని నిర్ధారించేదెప్పుడో తెలియడంలేదు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్‌బీకేఆర్ నివేదిక రాగానే పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి: పాశం



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఏఆరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డివిజన్‌స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే క్రీడాజ్యోతిని వెలిగించి, షాట్‌పుట్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించి ఏకాగ్రతను పెంపొందించుకునేందుకు క్రీడలు దోహదపడుతాయన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు పోటీలను నిర్వహించడంతో పాటు కిట్లు అందజేస్తున్నారన్నారు. విద్యార్థులు గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తితో మెలగాలన్నారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో విద్యార్థులు ప్రతిభచాటి జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో పాటు జాతీయస్థాయిలో రాణించి గూడూరుకు మంచిపేరు తీసుకురావాలన్నారు. స్టేడియంలో జిమ్, ఓపెన్ జిమ్, గ్యాలరీ నిర్మించి క్రీడాకారులకు వసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో డీవైఈవో సనత్‌కుమార్, ఎంఈవో కాంచన, నాయకులు బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, చంద్రమౌళి, పీడీలు కరిముల్లా, సుబ్రహ్మణ్యం, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన పెంపొందించేందుకే చెకుముకి పోటీలు



చెకుముకి పోటీల ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న ఎంఈవో కాంచన

గూడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సైన్స్‌పట్ల అవగాహన పెంపొందించేందుకు జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి పోటీలను నిర్వహించడం అభినందనీయమని ఎంఈవో కాంచన అన్నారు. మంగళవారం గూడూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో మండలస్థాయి చెకుముకి సైన్స్ పోటీ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మూఢ నమ్మకాలను పోగొట్టి విద్యార్థుల్లో సైన్స్‌పట్ల అవగాహన పెంపొందించేందుకు జేవీవీ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో జేవీవీ పట్టణ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, బాలకృష్ణంరాజు, నాగరాజు, చెంచునారాయణ, రామ్మోహన్‌రావు, పురుషోత్తమరావు, సుమన్, అరుణ్‌కుమార్, శ్రీనివాసాచారి కల్పన తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి చెకుముకి సైన్సు టాలెంట్ టెస్టు నిర్వహించారు. తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈవో సునీలా చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. వీరు ఈనెల 23న తిరుపతిలో జరిగే జిల్లాస్థాయి టాలెంట్ టెస్టుకు హాజరవుతారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, రాష్ట్ర కమిటీ సభ్యుడు చెంగయ్య, సూళ్లూరుపేట మండల అధ్యక్ష, కార్యదర్శులు రాజేష్‌బాబు, రామ్మూర్తి, ఉపాధ్యాయులు ప్రభాకర్, శామ్యూల్, మునస్వామి, బాస్కర్ పాల్గొన్నారు.



ప్రతిభ కబరిచిన విద్యార్థులతో ఎంఈవో సునీల, జేవీవీ నాయకులు

చిన్నమాంబట్టు ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ అందజేత



కంప్యూటర్ సామగ్రి అందజేస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

తడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నమాంబట్టు ఉన్నత పాఠశాలకు హిందూస్ కాఫీ పరిశ్రమ కంప్యూటర్ సామగ్రి అందజేసింది. మంగళవారం జరిగిన కార్యక్రమంలో కంప్యూటర్, సీపీయూ మానిటర్, ప్రింటర్ అందజేశారు. సీఎస్ఆర్ నిధులతో వీటిని సమకూర్చామని పరిశ్రమ ఏజీఎం రమేష్ తెలిపారు. పరిశ్రమ ప్రతినిధులను ఉపాధ్యాయులు శాలువాలతో సత్కరించింది. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో 20 మందికి గాయాలు

వాకాడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తేనెటీగల దాడిలో 20మందికి గాయపడిన ఘటన మండలంలోని రంగన్నగుంట వద్ద మంగళవారం జరిగింది. రోడ్డులో వెళ్తున్న ద్విచక్ర వాహనదారులపై ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. ఈ ఘటనలో 20మందికి పైగా గాయాలయ్యాయి. కొందరు వాకాడు ప్రభుత్వాస్పత్రికి, కొందరు కోటలోని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందారు.

మత్స్యకారుల జీవితాల్లో అక్షర దీపాలు

కోట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మత్స్యకార కుటుంబాల్లోని పిల్లల జీవితాల్లో అక్షరదీపాలు వెలిగించాలన్నదే శ్రీభారత్ ట్రస్టు ధ్యేయమని చైర్మన్ కొమారి కోటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని గోవిందపల్లిపాళెం మత్స్యకార గ్రామంలో శ్రీభారత్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాయంత్రం పాఠశాలను కోటేశ్వరరావుతో పాటు ట్రస్టు ప్రతినిధులు మంగళవారం సందర్శించారు. విద్యార్థులను విద్యాప్రమాణాలపై ఆరా తీశారు. విద్య ప్రాముఖ్యాన్ని స్థానికులకు వివరించారు. కార్యక్రమంలో పెదకాపు అక్కంగారి మస్తానయ్య, కొండూరు రంగయ్య, గోపాలయ్య, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సురేష్, సురేఖా తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల విద్యాప్రమాణాలను పరిశీలిస్తున్న శ్రీభారత్ ట్రస్టు చైర్మన్ కొమారి కోటేశ్వరరావు

రోడ్డుపై గుంతల పూడ్చివేత

చిట్టమూరు, నవంబర్ 4(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు సమీపంలో నాయుడుపేట - మల్లాం మార్గంలోని గుంతలను కొత్తగుంట యువకులు పూడ్చివేశారు. కొత్తగుంట ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డుపై పలుచోట్ల గుంతలు ఉండడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురౌతున్నారు. మంగళవారం చిట్టమూరు సర్పంచ్ కోటయ్య ఆధ్వర్యంలో కొత్తగుంట యువకులు సుధ, కోటి, రేవంత్ స్పందించి గుంతలను కాంక్రీట్‌తో పూడ్చివేశారు.

ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



వెంకటేశ్వరస్వామి ఆలయ నూతన పాలకమండలి సభ్యులు

గూడూరు అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టనంలోని రాజావీధిలో బుధవారం నిర్వహించనున్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ శ్రీకంటి రామమోహన్‌రావు అన్నారు. మంగళవారం ఆలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు. అమరయ్య నాయుడు, గోపాల్, రవీంద్రబాబు, మునేంద్ర, మునికోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు అభినందన



తహసీల్దారును అభినందిస్తున్న సుష్మారెడ్డి తదితరులు

కోట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోట తహసీల్దారు జయజయరావును టీడీపీ నాయకులు అభినందించారు. మొంథా తుఫాన్ సమయంలో విస్తృతంగా సహాయక చర్యలు చేపట్టిన జయజయరావు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రసంశా పత్రం అందుకున్న విషయం తెలిసిందే. మంగళవారం తెలుగు మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలు గండవరం సుష్మారెడ్డితో పాటు తిన్నెలపూడి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శాలువాలు, పూలమాలలతో జయజయరావు అభినందించారు.

చిట్టేడులో కోటి సంతకాల సేకరణ

కోట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడులో మంగళవారం వైసీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మేరిగ మురళి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కొడవలూరు ధనంజయరెడ్డి, మండల కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్‌రెడ్డి, నేదురుమల్లి హరిచంద్రారెడ్డి, ఎంపీపీ అంజమ్మ, రేష్మా, రాఘవరెడ్డి, నాగూర్‌రెడ్డి, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

మస్తాన్‌రెడ్డికి నెలవల పరామర్శ



మస్తాన్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ నెలవల

పెళ్లకూరు, నవంబరు, 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంబేడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మరుపూరు మస్తాన్‌రెడ్డిని సూళ్లూరుపేట ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పరామర్శించారు. ఇటీవల మస్తాన్‌రెడ్డి గుండెకు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. మంగళవారం నెలవల సుబ్రహ్మణ్యం మస్తాన్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. నెలవల వెంట టీడీపీ మండల అధ్యక్షుడు నంచి కృష్ణయ్య, చిల్లకూరు సొసైటీ డైరెక్టర్ పెళ్లకూరు గోపాల్‌కృష్ణ, నాయకులు మల్లికార్జునరెడ్డి, సుందరరామిరెడ్డి, మల్లు ప్రసాద్, రమేష్‌రెడ్డి, గుంటపూడి రమణయ్య తదితరులు ఉన్నారు.

రెట్టపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించండి

గూడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గూడూరు డిపో నుంచి చిల్లకూరు మండలం నెలబల్లిరెట్టపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ అన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో గూడూరు నుంచి రెట్టపల్లి గ్రామానికి నడిచే ఆర్టీసీ బస్సును రెండేళ్లుగా నిలిపివేయడం జరిగిందన్నారు. దీంతో గూడూరుకు రావాలంటే ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి రెట్టపల్లి, ఓడూరు, పునపువారిపాళెం గ్రామాలకు ఆర్టీసీ బస్సు నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శశికుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయంలో తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సాయిప్రసాద్, తహసీల్దారు ఇక్బాల్

వాకాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమూరు సచివాలయాన్ని ఎంపీడీవో సాయిప్రసాద్, తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే గురించి ఆరాతీశారు. త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. విధుల పట్ల ఎటువంటి అలసత్వం వహించవద్దని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హుస్సేన్‌బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నాయుడుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం చేకూరుతుందని నారాయణ పాఠశాలల ఏజీఎం నూర్ రియాజ్ అన్నారు. మంగళవారం నాయుడుపేటలోని పాఠశాలలో క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. విద్యార్థులకు రన్నింగ్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లికార్జున, ఏవో గౌస్ బాషా, కోఆర్డినేటర్ జన్నత్, డీన్‌లు శ్రీకాంత్, బాలా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

సూళ్లూరుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కడపత్ర, దామరాయి, కొరిడి పంచాయతీల్లో రైతులకు మంగళవారం యూరియా పంపిణీ చేశారు. మొత్తం 400 బస్తాల యూరియా రైతులకు అందజేశారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ఎకరాకు 3 బస్తాల చొప్పున యూరియా అందజేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయశాఖ సిబ్బంది చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయమకులు వెంకటేశ్వర్లు, తిరుపాల్, ప్రభాకర్, అక్కులయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరు అర్బన్: రబీ సీజన్‌లో రైతులకు అవరమైనంత యూరియాను అందుబాటులో ఉంచడం జరిగిందని వ్యవసాయశాఖ ఏడీ గోపీనాయక్ మంగళవారం తెలిపారు. ఇప్పటికే 80శాతం మంది రైతులకు యూరియా గుర్తింపుకార్డులు అందజేయడం జరిగిందన్నారు. మిగిలిన రైతులకు కూడా కార్డులను ఇస్తామన్నారు.

విత్తన శుద్ధితో నాణ్యమైన దిగుబడి

వెంకటగిరి టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విత్తన శుద్ధితో నాణ్యమైన దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాఖ ఏడీఏ అనసూయ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చినన్నపేట, ఉప్పరపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్‌లో ఎక్కడా యూరియా కొరత లేదని, ఏదైనా సమస్య ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో సుజాత, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ అనసూయ

హెచ్‌ఎం, వంట నిర్వాహకుల నడుమ వివాదం

వంట చేసిన టీచర్లు



వంటకు సమాయత్తం చేస్తున్న టీచర్లు

సత్యవేడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాఠశాల హెచ్‌ఎం, వంట నిర్వాహకుల మధ్య తలెత్తిన వివాదంతో విద్యార్థులకు టీచర్లే వంట చేసిన వైనమిది. సత్యవేడు మండలం రాజగోపాలపురం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం జ్యోతికి పాఠశాలలో పని చేస్తున్న వంట మహిళలు పోలమ్మ, వజ్రమ్మకు మధ్య వివాదం చోటు చేసుకుంది. పాఠశాలలో ఇదివరకు పని చేస్తున్న వంట మహిళలు నిలిచిపోవడంతో నిబంధనల మేరకు పేరెంట్స్ కమిటీ తీర్మానంతో ఎనిమిది నెలల క్రితం గ్రామానికి చెందిన పోలమ్మ, వజ్రమ్మను వంట మహిళలుగా నియమించారు. అయితే హెచ్‌ఎం జ్యోతి వీరి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో ఇటీవల విడుదలైన వేతనాలు వారి అకౌంట్‌లో జమ కాలేదు. దీంతో వంట మహిళలు మంగళవారం పాఠశాలకు వచ్చి తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయకుంటే తాము వంట చేసేది లేదని వెను తిరిగారు. అయితే విద్యార్థులు పస్తులు ఉండాల్సి వస్తుందని పాఠశాల టీచర్లే వంట చేసి పిల్లలకు వడ్డించారు. హెచ్‌ఎం జ్యోతి గతంలో దాసుకుప్పం జడ్పీ హైస్కూల్‌లో పని చేసినప్పుడు కూడా వంట మహిళలతో ఇదే తరహాలో వివాదం ఏర్పడగా అప్పట్లో జిల్లా విద్యాశాఖాదికారుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. ఈ నేపథ్యంలో హెచ్‌ఎం జ్యోతి అక్కడ నుంచి బదిలీపై ఇక్కడకు రావడం గమనార్హం.

వెదురు స్వాధీనం: ట్రాక్టర్ సీజ్



అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న వెదురు, ట్రాక్టర్

శ్రీకాళహస్తి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వెదురును అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు శ్రీకాళహస్తి అటవీ శాఖ సిబ్బంది వెల్లడించారు. రాచగున్నేరిలో ఓ ప్రైవేటు పరిశ్రమకు అదే గ్రామానికి చెందిన వ్యక్తి భారీగా వెదురు తరలిస్తున్నట్లు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అటవీ శాఖ అనుమతులు ద్వారా పవర్‌ప్లాంట్లకు ప్రత్యామ్నాయ బొగ్గుగా వెదురును ఉపయోగించాలని, కానీ రాచగున్నేరికి చెందిన ఓ వ్యక్తి అడవుల నుంచి రహస్యంగా వెదురును నరికి తరలిస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు శ్రీకాళహస్తి అటవీశాఖ అధికారి లోకేష్ సిబ్బందితో కలిసి రాచగున్నేరిలో వద్ద తనిఖీలు నిర్వహించారు. అటవీశాఖ అధికారులను చూసిన ఓ యువకుడు లోడ్‌తో ఉన్న ట్రాక్టర్‌ను వదలి పరారయ్యాడు. దీంతో వెదురు సహా ట్రాక్టర్‌ను కార్యాలయానికి తరలించి సీజ్ చేసినట్లు తెలిపారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి



ఎస్‌ఈతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదిమూలం ఎస్పీడీసీఎల్ ఆపరేషన్స్ తిరుపతి సర్కిల్ ఎస్‌ఈ కె.కరుణాకర్‌ను, ఏపీ ట్రాన్స్‌కో మెయింటెనెన్స్ అండ్ ఆపరేషన్స్ ఎస్‌ఈ వి.చంద్రశేఖర్‌ను కోరారు. మంగళవారం తిరుపతిలోని విద్యుత్‌శాఖ కార్యాలయానికి ఎమ్మెల్యే చేరుకుని ఈ మేరకు ఎస్‌ఈలకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిచ్చాటూరు మండలంలో ప్రభుత్వం మంజూరు చేసిన ముడియూరు సబ్‌స్టేషన్‌కు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని, సత్యవేడు మండలం చమర్తికండ్రిగలో తుది దశ నిర్మాణంలో ఉన్న సబ్‌స్టేషన్ పనులు వెంటనే పూర్తి చేయాలని కోరారు.

తెప్పలపై కల్యాణ వెంకన్న అభయం



తిరుచ్చిపై ఊరేగుతున్న స్వామిఅమ్మవార్లు

నారాయణవనం, నవంబర్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలో టీటీడీ అనుబంధంగా పద్మావతి సమేత కల్యాణ వెంకన్న ఆలయంలో కార్తీక తెప్పోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నాల్గో రోజు మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న పద్మ సరస్సులో విహరిస్తూ భక్తులకు కటాక్షించారు. ఉదయం నిత్యకైంకర్యాలు, స్నపన తిరుమంజనం జరిగాయి. సాయంత్రం దేవేరుల సహా శ్రీవారి ఉత్సవమూర్తులను తిరుచ్చి వాహనంపై పద్మ సరస్సు వేంచేపు చేశారు. అనంతరం తెప్పలపై అధిష్ఠింపజేసి సరస్సులో ఐదు ప్రదక్షిణలు చేశారు. భక్తులు దర్శించుకున్నారు. ఎమ్మెల్యే ఆదిమూలం స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. కాగా 2026 సంవత్సరానికి సంబంధించి టీటీడీ క్యాలెండర్లు, పంచాంగం, డైరీలను ఆలయంలో విక్రయిస్తున్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



చిన్నపాలేడు వద్ద స్వాధీనం చేస్తున్న బియ్యం

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగానెల్లూరు రోడ్డు చిన్నపాలేడు సమీపంలో మూడున్నర టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. చిన్నపాలేడు వద్ద రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారని సమాచారం అందడంతో సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మినీలారీని తనిఖీ చేశామన్నారు. అందులో రేషన్ బియ్యం ఉండడంతో శ్రీకాళహస్తికి చెందిన డ్రైవర్ సాయి, రాజాను అదుపులోకి తీసుకున్నామ న్నారు. బియ్యాని తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించినట్టు తెలిపారు.

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కీలగరం హరిజనవాడకు చెందిన రాజా ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 2200 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఎస్‌డీటీ హరికృష్ణ తెలిపారు. 50 కిలోల 44 బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాజాపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు జడ్పీ హైస్కూలు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పిచ్చాటూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పిచ్చాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిహారిక, ముఖేష్, కెబెరా రాష్ట్రస్థాయి అండర్-14, అండర్-17 రగ్బీ పోటీలకు ఎంపికయ్యారని పీడీలు స్వర్ణ, రమాదేవి తెలిపారు. ఈనెల 3న శ్రీకాళహస్తిలో జరిగిన రగ్బీ పోటీల్లో ప్రతిభకనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. నవంబరు 7, 9 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్య వహిస్తారన్నారు. ప్రధానోపాధ్యాయుడు గిరిప్రకాష్, ఉపాధ్యాయుడు వెంకటస్వామి తదితరులు విద్యార్థులను అభినందించారు.

కరాటే పోటీల్లో ఖ్యాతిశ్రీ ప్రతిభ



శ్రీకాళహస్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలో సెకండ్ డ్రీం ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో శ్రీకాళహస్తి ఎంజీఎం పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థిని ఖ్యాతిశ్రీ అండర్ -14 విభాగంలో రజత పతకం సాధించింది. ఈ నేపథ్యంలో మంగళవారం పాఠశాలలో ఖ్యాతిశ్రీని ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయలు మునిరత్నం నాయుడు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నారాయణవనం, నవంబర్ 4(ఆంధ్రజ్యోతి): బాధితులను ఆదుకోవడమే లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. మంగళవారం నారాయణవనానికి చెందిన కృష్ణకు రూ.4,00,596, అలాగే సత్యవేడు మండలం అంబాక్కానికి చెందిన మహాలక్ష్మికి రూ.1,20,846 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు

ముమ్మరంగా వరి నాట్లు





పలక తోలుతున్న రైతు - నారును కట్టలు కడుతున్న వ్యవసాయ కూలీలు



నారు నాటుతున్న మహిళా కూలీలు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వానలు తగ్గడంతో రబీ సీజన్‌లో మండలంలో ముమ్మరంగా వరినాట్లును వేస్తున్నారు. వర్షాలతో పూర్తి స్థాయిలో చెరువులు నిడడం దీనికి తోడు తెలుగుగంగ నీరు చెరువుల్లోకి చేరడంతో నాట్లు వేయడానికి సమాయత్తం అవుతున్నారు. కనమనంబేడు, గాజులపెళ్లూరు, నీర్పాకోట, కుక్కంబాకం, పెద్దపాలేడు తలారివెట్టు, కల్లివెట్టు, నెలవాయి, వేణుగోపాలపురం, వెస్ట్‌వరత్తూరుల్లో విస్తారంగా నాట్లు వేస్తున్నారు. ఈ సారి మెట్ట భూముల్లో సైతం వరి సాగుకు రైతులు సిద్ధపడుతున్నారు. రబీలో 9వేల ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం ఉంది. అయితే సకాలంలో యూరియా అందుతుందో లేదోననే బెంగ రైతుల్లో నెలకొంది.

కుమారస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై కొలువై ఉన్న కుమారస్వామి ఆలయంలో మంగళవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి అభిషేకాలు చేసి అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ముక్కంటి ఆలయ ప్రధాన అర్చకుడు కరుణాగురుకుల్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



శ్రీకాళహస్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఈశ్వరయ్యకాలనీలో మంగళవారం వే ఫౌండేషన్ నిర్వాహకులు గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకు ఉన్న దానిలో పేదలకు కొంత సాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి జె.గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ తనిఖీ

ఏర్పేడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌ను మంగళవారం సాయంత్రం ఎంఈవో-2 దయాకర్ తనిఖీ చేశారు. పరిసరాలను, వంటగదిని, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులకు భోజన సమయంలో తాగడానికి వేడినీరు ఇవ్వాలని సంక్షేమాధికారికి సూచించారు. అనంతరం విద్యార్థుల విద్యా ప్రమాణాలు పరిశీలించి మెలకువలను వివరించారు. సీఆర్పీ మునీశ్వర్, వసతిగృహ సిబ్బంది పాల్గొన్నారు.

హోటల్‌లో ....

శ్రీకాళహస్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలో పలు హోటళ్లను ఫుడ్‌సేఫ్టీ అధికారి జగదీష్ తనిఖీలు చేశారు. సన్నిధివీదిలోని పలు హోటళ్లను తనిఖీ చేసి నాణ్యత, శుభ్రత పాటించాలని సూచించారు. (నిబంధనలు పాటించి ప్రజలు, భక్తులకు శుచికరమైన ఆహారం అందించాలని తెలిపారు.

విద్యా సామగ్రి అందజేత

ఏర్పేడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లం ప్రాథమిక పాఠశాలకు మంగళవారం ఎస్‌ఓఎస్ చిల్డ్రన్ విలేజ్ - తిరుపతి కుటుంబ బలోపేత కార్యక్రమం ఆధ్వర్యంలో రూ.10వేల విలువైన విద్యా సామగ్రిని అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు రజియా మాట్లాడుతూ... విద్యార్థుల అభ్యాసానికి సామగ్రి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్‌ఓఎస్ ఉద్యోగి మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

మృతులకు నివాళి

శ్రీకాళహస్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నక్క హరిజనవాడకు చెందిన సుబ్రహ్మణ్యం, ఆయన కుమారుడు రూపేష్ సోమవారం పెళ్లకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం పట్టణంలోని వారి నివాసం వద్ద ఎమ్మెల్యే సుధీర్ తల్లి బృందమ్మ అక్కడికి చేరుకుని మృతదేహాలకు నివాళులర్పించారు. కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, నాయకులు పేట బాలాజీ, గోవిందు, శివ, నింద్ర సుధాకర్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళులు

రేణిగుంట నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): గురురాజు పల్లి మాజీ సర్పంచ్ రామచంద్రయ్య మృతదేహానికి ఎమ్మెల్యే సుధీర్ తల్లి బృందమ్మ నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ రామచంద్రయ్య మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న బృందమ్మ గురువరాజు పల్లి చేరుకొని ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యేలు భూమన, బియ్యపు మధు, ఎమ్మెల్సీ సిపాయి నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

విదేశీ వస్తువులు వద్దు.. స్వదేశీ వస్తువులు ముద్దు



కరపత్రాల పంపిణీలో బాబుయాదవ్ తదితరులు

కేవీబీపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ వస్తువుల వినియోగించాలంటూ కేవీబీపురం పట్టణంలో బీజేపీ మండల అధ్యక్షుడు బాబుయాదవ్ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. యువమోర్చా నాయకుడు పృథ్వీరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సంధ్యా మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విదేశీ వస్తువులపై మోజు తగ్గించి దేశంలో తయారైన స్వదేశీ వస్తువులను వినియోగించాలన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇతర దేశాలకు వెళ్లకుండా స్వదేశంలోనే పని చేయాలని కోరారు. వోకల్ ఫర్ లోకల్, ఆత్మనిర్భర్ భారత్, వికసిత్ భారత్ లక్ష్యాలు కావాలని పిలుపు నిచ్చారు. మునిశేఖర్‌యాదవ్, పరంధామయ్య, దినేష్, వెంకటముని, అజిత్‌కుమార్ పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో చీరాల ఎమ్మెల్యే



శ్రీకాళహస్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని మంగళవారం చీరాల ఎమ్మెల్యే ఎం.మాలకొండయ్య దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మద్దలూరి మాలకొండయ్య, ముక్కంటి ధర్మకర్తలమండలి సభ్యురాలు రజనీని టీడీపీ నాయకుడు, శ్రీకాళహస్తి కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రి పర్యటన

మామండూరు గెస్ట్‌హౌస్ వద్ద భద్రత ఏర్పాట్ల పరిశీలన

రేణిగుంట నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటన సందర్భంగా మామండూరు అటవీ ప్రాంతంలోని గెస్ట్‌హౌస్, పరిసర ప్రాంతాలను ఎస్పీ సుబ్బరాయుడు సిబ్బందితో పరిశీలించారు. ఈ నెల 8న పవన్ కల్యాణ్ పర్యటనలో భాగంగా పాత విమానాశ్రయం వద్ద ఉన్న ఎర్రచందనం గిడ్డంగులను పరిశీలించనున్నారు. అలాగే రాయలసీమ జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లో అభివృద్ధి, ఎకో టూరిజం ద్వారా సందర్శకులను ఆకర్షించే విధంగా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా అధికారులతో మామండూరు అతిథి గృహం వద్ద సమావేశం నిర్వహించనున్నారు. డీఎఫ్‌వో సాయిబాబా, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు జయచంద్ర, మంజునాథరెడ్డి సహా పోలీసులు పాల్గొన్నారు.

మండలస్థాయి చెకుముకి పోటీలు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం మండలస్థాయి చెకుముకి సైన్సు పోటీలు జరిగాయి. టీఎన్ కండ్రిగ, నెలవాయి ప్రభుత్వ పాఠశాలతో పాటు విద్యాస్ వికాస్, ఎస్వీఆర్ ప్రైవేటు పాఠశాలలకు చెందిన 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. నెలవాయి ఉన్నత పాఠశాల విద్యార్థులు హిమజ, హిందుజ, దేవ, విద్యాస్ వికాస్ విద్యార్తులు నిఖిలేష్, గౌతమ్, గురుసాయి జిల్లాస్థాయికి ఎంపికైనట్టు జేవీవీ జిల్లా అధ్యక్షుడు చెంగయ్య తెలిపారు. ఎంఈవో 2 మునిసుబ్రమణ్యం, హెచ్‌ఎం రమణయ్య, ఉపాధ్యాయులు షర్మిల, రత్నమ్మ, జోసఫ్ పాల్గొన్నారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి చెకుముకి పోటీలను స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో నిర్వహించారు. మొదటి స్థానంలో రేణిగుంట బాలుర పాఠశాల, అత్తూరు పాఠశాల, రేణిగుంట బాలికల పాఠశాల, కరకంబాడి పాఠశాలలు మొదటి నాలుగు స్థానాల్లో నిలిచాయి. ప్రైవ్రేటు పాఠశాలల్లో అమర రాజా, రెయిన్బో, లక్ష్మీప్రసన్న మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.

గుంతలో దిగబడిన లారీ



బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీకాళహస్తి- తడ రోడ్డు కాటూరు సమీపంలో పైపు లైన్ కోసం తీసిన గుంతలో లారీ దిగబడిపోయింది. శ్రీకాళహస్తి నుంచి చెన్నైకు వెళ్తుండగా కాటూరు సమీపంలో ఎదు రుగా వచ్చిన వాహనానికి సైడ్ ఇచ్చే క్రమంలో రోడ్డు కిందకు దింపడంతో గుంతలో ఇరుక్కుపోయింది. కేటీ రోడ్డుకు ఇరువైపులా పైపులైన్ల కోసం తీసిన గుంతల్లో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరింది. దీంతో రోడ్డు దిగిన వాహనాలు ఇలా ఇరుక్కుపోతున్నాయి.

'కులం పేరుతో దూషణపై కేసు నమోదు చేయండి'

ఏర్పేడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తన భర్తతో ఓ మహిళ చనువుగా ఉందని ఆమెపై కేసు నమోదు చేయాలని మరో మహిళ ఏర్పేడు పోలీసులను మంగళవారం ఆశ్రయించింది. చిత్తూరుకు చెందిన ఓ వ్యక్తి ఐఐటీలో సెక్యూరిటీ గా పనిచేస్తున్నాడు. అందులో పనిచేస్తున్న ఓ మహిళతో చనువుగా ఉన్నాడని గుర్తించిన అతని భార్య ఆమెకు ఫోన్ చేసింది. ఇద్దరు ఫోన్‌లో వాగ్వాదం చేసుకున్నారు. తన భర్తతో చనువుగా ఉన్నావని ప్రశ్నించందుకు తనను కులంపేరుతో ధూషించిందని ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డికి ఫిర్యాదు చేసింది. దీనిపై స్పందించిన ఆయన మహిళ చిత్తూరు వాసి కావడంతో ఏర్పేడు పోలీసులకు సంబంధం లేదని సర్దిచెప్పి పంపారు. దీనిపైఎలాంటి కేసు నమోదు కాలేదు.

వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయొద్దు

వైసీపీ నాయకుల డిమాండ్



సంతకం చేస్తున్న వైసీపీ నాయకుడు

శ్రీకాళహస్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయవద్దని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని భేరివారి మండపం వద్ద కోటిసంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ చేస్తూ పేదలకు వైద్యం అందకుండా చేస్తోందన్నారు. పీపీపీ విధానాన్ని రద్దు చేసేందుకే కోటి సంతకాల సేకరణ చేస్తున్నామన్నారు. వైసీపీ నాయకులు అంజూరు శ్రీనివాసులు, షేక్ సిరాజ్‌బాషా, శరవణ, అంజూరు వెంకటేష్, సురేష్, పఠాన్ ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాలతో కొత్త నాటకం

టీడీపీ నాయకుల ధ్వజం



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కోటి సంతకాల పేరుతో వైసీపీ కొత్త నాటకానికి తెర తీసిందని టీడీపీ నాయకులు అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పీపీపీ అంటే ప్రైవేటుకు అమ్మేయడం కాదని ప్రైవేటు, ప్రభుత్వం కలిసి అభివృద్ధి చేసేదని మాజీ సీఎం జగన్ తెలుసుకోవాలన్నారు. ఆయన తెచ్చిన జీవోలపై ఆనే కోటి సంతకాలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. కూటమి ప్రభత్వం పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలలు నిర్మించి పేదలకు అత్యాధునిక వైద్యసేవలను అందుబాటులోకి తెస్తుంటే దీనిపై వైసీపీ బురద జల్లుతోందన్నారు. దీన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. వజ్రం కిషోర్, డీపీ నారాయణ, చాంద్‌బాషా, కిరణ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య



కవిత మృతదేహం

శ్రీకాళహస్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పట్టణంలోని గాండ్లవీధిలో మంగళవారం జరిగింది. శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు... గాండ్లవీధికి చెందిన చలపతి ప్రైవేటు పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. కొంతకాలంగా కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. దీంతో మంగళవారం భర్తపై మనస్థాపం చెందిన కవిత(42) ఇంట్లో ఉరి వేసుకుంది. కుటుంబ సభ్యుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.